
తెలుగు దినపత్రిక
https://aksharagalam.com
# అక్షరగళం
నిజం.. నిర్భయంగా




హైదరాబాద్ | 27-02-2026 పేజీలు 8 /aksharagalam.com సంపుటి : 14 సంచిక : 2 వెల : 3/-




## భారీగా ఐఏఎస్‌ల బదిలీలు

- మొత్తం 45మందిని బదిలీ చేస్తూ ఉత్తర్వులు
- పలు జిల్లాలకు కొత్త కలెక్టర్ల నియామకం

*తెలంగాణలో భారీగా ఐఏఎస్ అధికారుల బదిలీలు జరిగాయి. మొత్తం 45 మందిని బదిలీ చేస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు ఉత్తర్వులు జారీ చేశారు. పరిపాలనా అవసరాల దృష్ట్యా రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఒకేసారి 45 మంది ఐఏఎస్ అధికారులకు బదిలీలు, పోస్టింగ్‌లు ఇస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.*

**హైదరాబాద్:** ఈ బదిలీల్లో కలెక్టర్ల స్థాయిలో పెద్దఎత్తున మార్పులు చోటుచేసుకున్నాయి. పలు జిల్లాలకు కొత్త కలెక్టర్ల నియామకం జరిగింది. మహబూబాబాద్, మెదక్, రాజన్న సిరిసిల్ల, భద్రాద్రి జిల్లాలకు కొత్త కలెక్టర్లను నియమించారు. టీఎస్‌జీపీడీసీఎల్‌కు కొత్త సీఎండీ నియామకం జరిగింది. సాధారణ పరిపాలన శాఖ (జీఏడీ) ముఖ్యకార్యదర్శిగా రాహుల్ బొజ్జా నియమితులయ్యారు. బీసీ సంక్షేమశాఖ ముఖ్యకార్యదర్శిగానూ ఆయనకు అదనపు బాధ్యతలు అప్పగించారు. పంచాయతీరాజ్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా సంజయ్‌కుమార్, విపత్తు నిర్వహణ, రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా దాన కిషోర్‌ను నియమించారు. ఫైనాన్స్ అండ్ ప్లానింగ్

మిగతా 2లో



- ప్రతి నియోజకవర్గంలో టీపీఎస్ ఏర్పాటు చేయాలి
- ప్రభుత్వానికి రాష్ట్ర విద్యా కమిషన్ సిఫారసులు
- 12వ తరగతిలో మాత్రమే బోర్డ్ పరీక్షలుండాలి
- నర్సరీ నుంచే ఇంగ్లీష్ మీడియం తప్పనిసరి
- విద్యారంగంపై సమీక్షలో సిఎం రేవంత్ కీలక ఆదేశాలు



## పబ్లిక్ స్కూళ్లతో విద్యావ్యవస్థ బలోపేతం

కోర్ అర్బన్ రీజియన్‌లో ప్రభుత్వ స్కూల్స్‌లో మౌలిక సదుపాయాల కల్పనపైన దృష్టి సారించాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సూచించారు. ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ నిర్మాణంలో రాజీ పడొద్దని స్పష్టం చేశారు. భారతీయ విద్యా భవన్, జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూళ్లల్లో ఉన్న మౌలిక సదుపాయాలు ప్రభుత్వ పాఠశాలల్లో కూడా ఉండాలని సూచించారు. గురువారం ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్‌పైన సీఎం రేవంత్‌రెడ్డి సమీక్షా సమావేశం నిర్వహించారు.

2



## తెలంగాణలో దుర్మార్గమైన ప్రభుత్వం

- పేదల ఇళ్లు కూల్చిన దుర్మార్గులు
- ముగ్గురు మంత్రుల పన్నాగం ఇది
- అసెంబ్లీలో మీ పక్షాన పోరాడుతాం
- కోర్టుల్లో పైసా ఖర్చు లేకుండా నిలబడతాం
- వెలుగుమట్ల బాధితులను పరామర్శించిన కెటిఆర్

2

*తెలంగాణలో దుర్మార్గమైన ప్రభుత్వం రాజ్యమేలుతోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఖమ్మం వెలుగుమట్ల భూదాన్ భూముల్లో తొలగించిన ఆక్రమణలను కేటీఆర్ పరిశీలించారు. బాధితులను పరామర్శించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడారు. వచ్చే నెల16వ తేదీ నుంచి అసెంబ్లీ ప్రారంభ మవుతుందని ఖమ్మం ప్రజల సమస్యను అసెంబ్లీలో ప్రస్తావిస్తామని అన్నారు. మీ అందరికీ న్యాయం జరిగేవరకూ మీ పక్షాన ప్రభుత్వంపై పోరాడతామని చెప్పుకొచ్చారు. తాము అధికారంలోకి రాగానే మీ అందరికీ ఇదే స్థలంలో ఇళ్లస్థలాలు ఇచ్చి ఇళ్లు కట్టిస్తామని కేటీఆర్ భరోసా కల్పించారు.*

## ప్రభుత్వ పథకాల అమలు బాధ్యత మీదే

### శిక్షణ పూర్తి చేసుకున్న అధికారులతో సిఎం రేవంత్



**హైదరాబాద్:** తెలంగాణ ప్రజలు ఆకలినైనా సహిస్తారు కానీ, ఆధిపత్యాన్ని సహించబోరని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. టీజీపీఎస్సీని ప్రక్షాళన చేసి గ్రూప్ 1 పరీక్షలను నిర్వహించి.. నియామక పత్రాలు అందించామన్నారు. గ్రూప్ 1, 2 ఉద్యోగుల శిక్షణ ముగింపు కార్యక్రమంలో సీఎం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ ఉద్యోగాలను అమ్ముకున్నామని కోర్టుల్లో లీగల్ లిటిగేషన్ పెట్టారని, రాష్ట్ర ప్రభుత్వం ఒక్క తప్పు కూడా చేయలేదని

మిగతా 2లో



## పెన్షన్ల హామీ గుదిబండ కానుందా?

- పెంచితే ఖజానాపై బారీగా భారం
- పెంచకుంటే విపక్షాల నుంచి విమర్శలు
- మల్లగుల్లాలు పడుతున్న అధికార పక్షం

*ఆరు గ్యారెంటీలు, పెన్షన్ల పెంపు, తులం బంగారంపై విపక్ష బిఆర్ఎస్ ఎక్కడిక్కడ నిలదీస్తోంది. దీనికితోడు వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో సర్కార్‌ను నిలదీసేందుకు సన్నద్ధం అవుతోంది. బడ్జెట్ లెక్కలు వేసుకుంటున్న ప్రభుత్వం ఈ మొత్తాలకు మరింత వెచ్చించాలంటే జంకుతోంది. ఇప్పటికే వేలకోట్లు అప్పులకు గాను వడ్డీలు చెల్లిస్తోంది.*

**హైదరాబాద్:** 2024 సామాజిక సర్వే లెక్కల ప్రకారం ప్రస్తుతం 42.7 లక్షల మందికి పింఛను అందుతోంది. ఇందుకోసం ప్రతి నెలా రూ.950 కోట్ల వరకు ఖర్చవుతోంది. ఈ పింఛన్‌ను ప్రస్తుతానికి రూ.500 చొప్పున పెంచితే.. నెలకు సుమారు రూ.210 కోట్లు అదనంగా అవసరమవుతాయి. అంటే ఏడాదికి రూ.2500 కోట్లకు పైగా భారం ప్రభుత్వంపై పడనుంది. దీనిపై తుది నిర్ణయానికి వచ్చాక బ్జడెట్‌లో కూడా ప్రస్తావించే అవకాశాలున్నాయి. తొలి విడతలో పెంచాలని భావిస్తున్న మొత్తాన్ని

మిగతా 2లో

## అభివృద్ధిని చూసి ఓర్వలేక విషం చిమ్ముతున్న బిఆర్ఎస్



- కాళేశ్వరం ప్రాజెక్టు కేవలం కమిషన్ల కోసమే నిర్మాణం
- సిబిఐ విచారణ కోరినా పట్టించుకోని బిజెపి
- వెలుగుమట్ల బాధితులకు న్యాయం చేస్తాం
- వారిని ఆదుకునే బాధ్యత ప్రభుత్వానిదే
- మీడియా సమావేశంలో మండిపడ్డ మంత్రి పొంగులేటి

2



## గ్రేహౌండ్స్.. ఎస్ఐబీ ఇక చరిత్ర గతిలోకి!

- ఇలాంటి విభాగాలను ఎత్తేయాలని కేంద్రం లేఖ!
- మావోయిస్టులతో పాటు ప్రత్యేక విభాగాలు కూడా కనుమరుగు

**హైదరాబాద్:** దాదాపు నాలుగున్నర దశాబ్దాల పాటు హడలెత్తించిన వామపక్ష తీవ్రవాదం చివరి అంకానికి చేరడంతో పోలీసుశాఖలో వ్యవస్థాపరమైన మార్పులు జరగబోతున్నాయి. ఇన్నేళ్లుగా మావోయిస్టులపై పోరాటంలో కీలకపాత్ర

మిగతా 2లో

## రాష్ట్రంలో అభివృద్ధిపై వందరోజుల కార్యక్రమాలు

- మంత్రులు, ప్రజా ప్రతినిధులు పాల్గొనేలా కార్యాచరణ
- ప్రతీ శాఖ వందరోజుల కార్యాచరణపై ప్రణాళిక
- మార్చి 1న జిల్లా కలెక్టర్లతో సిఎం రేవంత్ సమావేశం
- అధికారుల సమావేశంలో సిఎస్ రామకృష్ణారావు ఆదేశం

*రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు రాష్ట్రంలో వివిధ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల అమలుపై 100 రోజుల కార్యక్రమాన్ని చేపడుతున్నట్టు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె రామకృష్ణా రావు వెల్లడించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి తోపాటు రాష్ట్ర మంత్రులు ప్రజా ప్రతినిధులు పాల్గొనే ఈ వంద రోజుల కార్యక్రమంలో అన్ని శాఖల వారీగా విస్తృత కార్యక్రమాలు చేపట్టాలని ఆదేశించారు.*



**హైదరాబాద్:** డా.బి.ఆర్. అంబేద్కర్ సచివాలయంలో గురువారం రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు, ముఖ్య కార్యదర్శులు, కార్యదర్శులతో ప్రత్యేక సమావేశాన్ని సి.ఎస్ నిర్వహించారు. స్పెషల్ సి.ఎస్ లు జయేష్ రంజన్, వికాస్ రాజ్ ,సి.వీ ఆనంద్ , సంజయ్ కుమార్ , మహేష్ దత్ ఎక్కా, సబ్యసాచి ఘోష్, నవీన్ మిట్టల్, దాన కిషోర్, అహ్మద్ నదీమ్, తదితరులు హాజరైన ఈ సమావేశంలో

మిగతా 2లో



## ద్వైపాక్షికంలో సరికొత్త శకం

- ‘ప్రత్యేక వ్యూహాత్మక భాగస్వామ్యం’ స్థాయికి భారత్, ఇజ్రాయెల్ బంధం
- నెతన్యాహుతో ప్రధాని మోదీ భేటీ
- త్వరలోనే ఎఫ్‌టీఏ కుదుర్చుకోవాలని నిర్ణయం
- 17 ఒప్పందాలపై సంతకాలు
- భారత పర్యటనకు రావాలని ఇజ్రాయెల్ అధ్యక్షుడు హెర్జోగ్‌కు మోదీ ఆహ్వానం

**జెరూసలెం:** భారత్–ఇజ్రాయెల్ సంబంధాల్లో సరికొత్త శకం మొదలైంది. ఎన్నో కాల పరీక్షలకు నిలిచిన తమ బంధాన్ని ఇరు దేశాలు తాజాగా ‘ప్రత్యేక వ్యూహాత్మక భాగస్వామ్యం’ స్థాయికి పెంచుకున్నాయి. ఉభయ ప్రయోజనకర స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాన్ని (ఎఫ్‌టీఏ) త్వరలోనే కుదుర్చుకోవాలనీ నిర్ణయించుకున్నాయి. ఇజ్రాయెల్ పర్యటనలో భాగంగా ఆ దేశ ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహుతో భారత ప్రధాని మోదీ గురువారం భేటీ అయ్యారు. ద్వైపాక్షిక బంధాన్ని మరింత బలోపేతం చేసుకునే దిశగా చర్చలు

మిగతా 2లో

# పబ్లిక్ స్కూళ్లతో విద్యావ్యవస్థ బలోపేతం

**హైదరాబాద్:** ఈ సందర్భంగా అధికారులకు పలు కీలక అంశాలపై సీఎం దిశానిర్దేశర చేశారు. ఈ సమావేశానికి సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ సలహాదారు కే కేశవరావు, సీఎంఓ ముఖ్య కార్యదర్శి శేషాద్రి, సీఎం ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి, విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళీ, ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ బాలకృష్ణా రెడ్డి , విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా , కళాశాల విద్యాశాఖ కమిషనర్ దేవసేన, ఉస్మానియా యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ కుమార్, అంబేద్కర్ యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ ఘంటా చక్రపాణి హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో బ్రేక్ ఫాస్ట్ స్కీమ్‌ను పకడ్బందీగా



అమలు చేయాలని మార్గనిర్దేశం చేశారు. బ్రేక్ ఫాస్ట్ స్కీమ్‌లో తప్పనిసరిగా పాలు అందజేయాలని నిర్దేశిరచారు. ఇందుకోసం విజయా డైరీ నుంచి పాలు సేకరించాలని సూచించారు. మధ్యాహ్న భోజనం నాణ్యత కోసం ఏఐ టెక్నాలజీని వినియోగించాలని దిశానిర్దేశర చేశారు. కోర్ అర్బన్ రీజియన్ మినహా మిగిలిన నియోజకవర్గాల్లో పైలట్ ప్రాజెక్ట్ కింద ఒక్కొక మండలంలో ఆరుట్ల స్కూల్ తరహాలో ట్రాన్స్‌పోర్ట్‌తో సహా అన్ని సౌకర్యాలు కల్పించాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల ట్రాన్స్‌పోర్ట్ కోసం ఎలక్ట్రిక్రల్ బస్సుల ఏర్పాటు పైన అధ్యాయనం చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. ప్రైవేట్ స్కూల్స్‌లో నిబంధనలకు మించి ఫీజులు వసూలు చేస్తే అనుమతి రద్దుతో పాటు రికవరీ చేసేలా నిబంధన విధించాలని హుకుం జారీ చేశారు. ప్రైవేట్ స్కూల్స్‌లో ఫీజుల నియంత్రణకు సంబంధించి రికమండేషన్స్‌ని ప్రజాభిప్రాయం కోసం వెబ్‌సైట్‌లో ఉంచాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు.

## మొదటి పేజి తరువాయి

### పెన్షన్ల హామీ గుదిబండ కానుందా?

కూడా కలిపి బ్జడెట్‌లో కేటాయింపులు చేయన్నుట్లు తెలుస్తోంది. కాగా, దివ్యాంగుల పింఛను పొందేవారు తక్కువ సంఖ్యలోనే ఉన్నారని, వీటి వరకు కొంత ఎక్కువ మొత్తం పెంచాలన్న విజ్ఞప్తులు కూడా ఉన్నాయి. అయితే అందరికీ ఒకే విధంగా, సమ స్థాయిలోనే పెంచాలని ప్రభుత్వం ప్రాథమికంగా ఒక అభిప్రాయానికి వచ్చినట్లు సమాచారం. చేయూత ఫించన్లను ఇలా విడతల వారీగా పెంచుతూ ఎన్నికల నాటికి రూ.4 వేలకు తీసుకెళ్లాలన్న యోచనలో ప్రభుత్వం ఉన్నట్లు తెలుస్తోంది. అయితే దీనిపై ఇప్పటివరకు అధికారుల స్థాయిలో మాత్రం చర్చలు మొదలుకాలేదు. ప్రభుత్వం తుది నిర్ణయం తీసుకున్నాకే తమకు సమాచారం చేరుతుందని ఉన్నతాధికారి ఒకరు పేర్కొన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు చేయూత పథకం కింద ఇస్తున్న పింఛన్‌ను పెంచాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. అయితే రాష్ట్ర ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా.. పింఛను మొత్తాన్ని విడతల వారీగా పెంచాలన్న అభిప్రాయంతో ఉంది. ప్రస్తుతం చేయూత పథకం ద్వారా వృద్ధులు, ఒంటరి మహిళలు, ఎయిడ్స్ రోగులు, డయాలసిస్ రోగులు, చేనేత, గీత కార్మికులు, బీడీ కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం రూ.2016 చొప్పున, దివ్యాంగులకు రూ.4016 చొప్పున పింఛను ఇస్తోంది. కానీ, ఎన్నికల సమయంలో చేయూత పింఛన్‌ను రూ.4 వేలకు, దివ్యాంగుల పింఛన్‌ను రూ.6 వేలకు పెంచుతామని కాంగ్రెస్ హామీ ఇచ్చింది. ఇప్పటికే ఆరు గ్యారంటీల్లో భాగంగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, గృహజ్యోతి కింద 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రూ.500కే గ్యాస్ సిలిండర్, సన్నబియ్యం వంటి హామీలను అమలులోకి తెచ్చిన రేవంత్‌రెడ్డి సర్కారు.. ఇప్పుడు పింఛన్ల పెంపుపై దృష్టి సారించింది. అయితే ఈ హామీని కొంతకాలం ఆగాక నెరవేర్చడమా? లేదంటే ఇప్పటి నుంచే విడతల వారీగా పింఛను పెంచుతూ వెళ్లడమా? అని ఉన్నత స్థాయిలో చర్చ జరిగినట్లు సమాచారం. విడతలవారీగా పెంచితే.. తొలి విడతలో రూ.500 పెంచాలన్న అభిప్రాయంతో ప్రభుత్వం ఉందని తెలుస్తోంది.

### రాష్ట్రంలో అభివృద్ధిపై వందరోజుల కార్యక్రమాలు

సి.ఎస్ మాట్లాడుతూ, ఈ వంద రోజుల కార్యక్రమంపై ఈ నెల 28వ తేదీన నిర్వహించే కార్యదర్శుల సమావేశానికి రాష్ట్ర ముఖ్యమంత్రి హాజరవుతారని తెలిపారు. అదేవిధంగా మార్చ్ 1వ తేదీ ఆదివారం నాడు జిల్లా కలెక్టర్ల సమావేశం నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. మార్చి 2వ తేదీ నుండి జూన్ 9 వ తేదీ వరకు వివిధ అభివృద్ధి పనులపై ప్రతీ శాఖ తమ 100 రోజుల కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేయాలని, జిల్లా కలెక్టర్ల సమావేశంలో చర్చనీయాంశాలు వెంటనే రూపొందించాలన్నారు. ఈ సందర్భంగా వివిధ అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను రాష్ట్ర ముఖ్యమంత్రి తో పాటు రాష్ట్ర మంత్రులు ప్రారంభిస్తారని ఇందుకు గాను ఇప్పటికే నిర్మాణం పూర్తయిన ప్రభుత్వ భవనాలను సిద్ధం చేయాలనీ అన్నారు. ప్రధానంగా గ్రామీణాభివృద్ధి, మున్సిపల్, హెల్త్, ఎడ్యుకేషన్, పంచాయితీ రాజ్, వ్యవసాయం, రెవెన్యూ, పర్యాటక, పరిశ్రమలు, మహిళా శిశు సంక్షేమం, గృహనిర్మాణం, రెవెన్యూ, విద్యుత్, కార్మిక తదితర అన్ని శాఖలు కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని సి.ఎస్ పేర్కొన్నారు. ముఖ్యంగా, పారిశుధ్యం గ్రామీణాభివృద్ధి ఆరోగ్య తదితర కార్యక్రమాలపై నూతనంగా ఎన్నికైన సర్పంచులు, మున్సిపల్ చైర్మన్లకు అవగాహన చైతన్య కార్యక్రమాల మాదిరిగా కార్యక్రమాలు నిర్వహించాలని స్పష్టం చేశారు. సచివాలయం తోపాటు హెచ్.ఓ.డి లలో ఈ-ఆఫీస్ ను అమలు చేయాలని ఆదేశించారు.

# తెలంగాణలో దుర్మార్గమైన ప్రభుత్వం

**ఖమ్మం:** అందరూ ధైర్యంగా ఉండాలని అంటూ బాధితులకు కేటీఆర్ మాటిచ్చారు. హైదరాబాద్ నుంచి ఖమ్మం వరకు ఎక్కడ చూసినా కూల్చివేతలేనని ఆరోపించారు. ఖమ్మంలో కూల్చివేసిన కాలనీ చూశానని.. ముగ్గురు మంత్రులకు 60 ఎకరాల మీద కన్నుబడిందని ఆక్షేపించారు. ముగ్గురు మంత్రులు కలిసికట్టుగా ఈ దుర్మార్గం చేశారని విమర్శించారు. కేసీఆర్ ప్రభుత్వంలో ఎవరికీ తాము అన్యాయం చేయలేదని కేటీఆర్ స్పష్టం చేశారు. అందరూ ధైర్యంగా ఉండాలని.. మీ అందరికీ అదే ప్రాంతంలో అక్కడే ఇళ్ల స్థలాలు ఇల్లు ఇస్తామని మాటిచ్చారు. ఇక్కడి వారందరికీ అండగా నిలబడాలని తాను వచ్చానని చెప్పుకొచ్చారు. ఇళ్ల కూల్చివేతపై కోర్టుకి కూడా వెళ్దామని.. మీకెవరికీ ఒక రూపాయి ఖర్చు లేకుండా మీ తరఫున తమ లీగల్ టీం పోరాడుతుందని మాజీమంత్రి కేటీఆర్ పేర్కొన్నారు. పేదలు ఎంతో కష్టపడి కట్టుకున్నఇళ్లను కాంగ్రెస్ ప్రభుత్వం బుల్డోజర్లతో కూల్చివేస్తున్న సంగతి తెలిసిందే. రేవంత్ సర్కార్ కనికరం లేకుండా ఖమ్మం అర్బన్ వెలుగుమట్ల భూదాన్ భూముల్లో పేదల ఇళ్లను నేలమట్టం చేస్తోంది. ఈ క్రమంలో వారికి అండగా నిలిచేందుకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఖమ్మం జిల్లా వెలుగుమట్ల బాధితులను కలిశారు. ఇళ్లు కోల్పోయిన వెలుగు మట్ల బాధితులను కేటీఆర్, పార్టీ నేతలతో కలిసి పరామర్శించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. మిమ్మల్ని పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, తుమ్మల నాగేశ్వర్ రావు , డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పిలుస్తరు. మీకు అది చేస్తం.. ఇది చేస్తం.. అది చేస్తమని.. మీ 900 కుటుంబాల్లో చిచ్చు పెట్టే ప్రయత్నం చేస్తాడు. మీరు ఐక్యంగా ఉంటేనే విజయం సాధిస్తరు.. లేదంటే వీళ్లు ఏం చేస్తరు. ఏ 100 మందితో వేలి ముద్రలు తీసుకొని మీకు ఆన్నేన్నో ఇస్తరు.. కేసీఆర్ 2000 డబుల్ బెడ్ రూం ఇండ్లు కట్టించారు. వాటిలో కొన్ని మిగులున్నయట. ఆ ఇండ్లలో కొంతమందికిస్తమని చెప్పి వారిని లొక్కెళతారని కేటీఆర్ హెచ్చరించారు. ఓపీడీఆర్ వాళ్లు గతంలో ఎప్పుడో చేసిన పని. పాపం వాళ్లేం తప్పు చేయలేదు.. మీకు పట్టాలిప్పించారు. వాళ్లు తప్పు చేసిందేమి లేదు.. ఇప్పుడు వాళ్లను పట్టుకుని ప్రభుత్వం నానా మాటలు అంటోంది. ల్యాండ్ మాఫియానట.. ఎవడమ్మా ల్యాండ్ మాఫియా.. ఎవడైతే ఇవాళ మీ చుట్టూ వందల ఎకరాలు కొన్నాడో.. ఎవడైతే పేదవాడి ఇల్లు కట్టుకున్నడో వాడు మాఫియానా..? మీకు జరిగిన కష్టం.. మీ ఏడుపులు రాష్ట్రం మొత్తం చూసింది. మీ పిల్లలు, మీరు పడుతున్న అవస్థలు చూసే కేసీఆర్ సార్ మమ్మల్ని పంపించారు. దయచేసి ధైర్యంగా ఉండండి.. మీకు అన్ని రకాలుగా అండగా అజయ్ అన్న, మా ఎంపీ గాయత్రి రవిచంద్ర ఉంటారన్నారు. ఏ తప్పు జరుగకపోతే ఆర్డీవోను ఎందుకు వెంటనే బదిలీ చేశారు. సమాధానం చెప్పాలే ప్రభుత్వం. మంత్రులు తప్పు చేయకపోతే.. నిజంగా ధైర్యముంటే వాళ్ళెందుకు రావడం లేదు.. ఇక్కడికి.. వాళ్లొచ్చి మాట్లాడాలి కదా.. అందుకే మీరు ధైర్యంగా ఉండండి. మీ వెంబడి కేసీఆర్ అన్న ఉన్నడు.. కేటీఆర్ అన్న ఉన్నడు. మేమంతా ఉన్నం. ఎట్టి పరిస్థితుల్లో మీకు న్యాయం జరిగేదాకా మేము అండగా ఉంటామని హామీనిచ్చారు. మీకు అన్ని కాగితాలున్నాయి.. కోర్టుకు పోదాం.. కోర్టుకు కూడా మీరు రూపాయి ఖర్చు పెట్టుకునే పని లేదు. పార్టీ తరపున మేం కొట్లాడుతాం.. మీకు మేం అండగా ఉంటాం. మళ్లీ వస్తాం మిమ్మల్ని కాపాడుకుంటాం. న్యాయపరంగా పట్టాలిప్పించే ప్రయత్నం చేస్తాం. దయచేసి ఐకమత్యాన్ని కోల్పోకండి.. సంఘటితంగా, ఒక్కటిగా ఉండండిని సూచించారు.

# ద్వైపాక్షికంలో సరికొత్త శకం

మొదటి పేజీ తరువాయి

జరిపారు. అమెరికా-ఇరాన్ ప్రతిష్టంభన కూడా వారి చర్చల్లో ప్రస్తావనకు వచ్చింది. మోదీ-నెతన్యాహు భేటీ అనంతరం- వాణిజ్యం, వ్యవసాయం, విద్య, ఇంధనం, సైబర్‌స్పేస్, డిజిటల్ చెల్లింపులు తదితర రంగాల్లో దిల్లీ-టెల్‌అవీవ్ మొత్తం 17 కీలక ఒప్పందాలను కుదుర్చుకున్నాయి. సాంకేతికతల బదిలీ ఫ్రేమ్‌వర్క్ ద్వారా మిలిటరీ హార్డ్‌వేర్ సంయుక్త అభివృద్ధి, ఉత్పత్తి చేపడుతూ.. తమ మధ్య ఇప్పటికే ఉన్న సన్నిహిత రక్షణ భాగస్వామ్యాన్ని మరింత విస్తరించుకోవాలని నిర్ణయించుకున్నాయి.

**భవిష్యత్ సాంకేతికతల కోసం భాగస్వామ్యం**

కృత్రిమ మేధ(ఏఐ), క్వాంటమ్, కీలక ఖనిజాల రంగాల్లో సహకారాన్ని మరింత పెంచుకునేందుకు భారత్-ఇజ్రాయెల్ కీలక, భవిష్యత్ సాంకేతికతల భాగస్వామ్యాన్ని ఏర్పరుచుకుంటున్నట్లు మోదీ ప్రకటించారు. ఇజ్రాయెల్‌లో యూపీఐ వినియోగానికి ఒప్పందం కుదిరిందన్నారు. పశ్చిమాసియాలో శాంతి, స్థిరత్వంతో భారత భద్రతా ప్రయోజనాలు నేరుగా ముడిపడి ఉన్నాయని.. నెతన్యాహుతో భేటీ అనంతరం మీడియాకు విడుదల చేసిన ప్రకటనలో మోదీ పేర్కొన్నారు. సంఘర్షణలకు మానవాళి బలిపశువుగా మారకూడదంటూ, గాజా శాంతి ప్రణాళికకు భారత మద్దతును పునరుద్ఘాటించారు. ఉగ్రవాదానికి ప్రపంచంలో చోటు లేదన్నారు. ప్రధానుల చర్చల అనంతరం ఇరు దేశాలు ఉమ్మడి ప్రకటనను కూడా విడుదల చేశాయి. ఏఐ, ఆరోగ్య సేవలు, వ్యవసాయం వంటి రంగాల్లో వినూత్న ఆవిష్కరణలను ప్రదర్శిస్తూ జెరూసలెంలో



ఏర్పాటుచేసిన ఇన్నొవేషన్ ఎగ్జిబిషన్‌ను మోదీ సందర్శించారు. ఆయా ఆవిష్కరణలను చూసి ముగ్ధులయ్యారు. భారత్‌లో పెట్టుబడులు పెట్టాలని ఇజ్రాయెలీ టెక్నాలజీ కంపెనీలకు ఆయన పిలుపునిచ్చారు.

**ఇజ్రాయెల్ అధ్యక్షుడితో భేటీ**

ఇజ్రాయెల్ అధ్యక్షుడు ఇసాక్ హెర్జోగ్‌తో మోదీ భేటీ అయ్యారు. విద్య, స్టార్టప్‌లు, నవకల్పనలు, సాంకేతికతలు, అనుసంధానం తదితర రంగాల్లో ఇరు దేశాల మధ్య సహకారాన్ని మరింత పెంచుకోవడంపై చర్చించారు. ద్వైపాక్షిక మైత్రికి చిహ్నంగా మోదీ, హెర్జోగ్ ఓక్ చెట్టును నాటారు. భారత పర్యటనకు రావాలంటూ ఇజ్రాయెల్ అధ్యక్షుణ్ని భారత ప్రధాని ఆహ్వానించారు. భారత సంతతికి చెందిన పలువురు యూదు ప్రముఖులు జెరూసలెంలో మోదీతో సమావేశమయ్యారు. ప్రధానిని కలిసినవారిలో రికీ షాహీ, ఇసాక్ థాంగ్జన్ తదితరులు ఉన్నారు.

# అభివృద్ధిని చూసి ఓర్వలేక విషం చిమ్ముతున్న బిఆర్ఎస్

**హైదరాబాద్:** తెలంగాణ ప్రధాన ప్రతిపక్ష నాయకులు రాష్ట్ర అభివృద్ధిని చూసి ఓర్వలేక విషం చిమ్ముతున్నారని రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మండిపడ్డారు. వరుస ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి పెరుగుతున్న ప్రజాదరణను చూసి బీఆర్ఎస్ నేతలు జీర్ణించుకోలేకపోతున్నారని ఆయన విమర్శించారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రాజెక్టుల అవినీతిపై కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రపంచంలోనే ఎనిమిదో అద్భుతంగా చెప్పుకున్న కాళేశ్వరం ప్రాజెక్టు కేవలం కమిషన్ల కోసమే కట్టారని పొంగులేటి ఆరోపించారు. 38 వేల కోట్లతో పూర్తి కావాల్సిన తుమ్మిడిహెట్టి ప్రాజెక్టును పక్కనపెట్టి, తమ రాచరికాన్ని చాటుకోవడం కోసం లక్షల కోట్లతో కాళేశ్వరం నిర్మించారు. తీరా చూస్తే ఎన్నికల ముందు ఆ ప్రాజెక్టు పేకమేడలా కూలిపోయిందని ఎద్దేవా చేశారు. గత నాలుగేళ్లలో 162 టీఎంసీల నీటిని లిఫ్ట్ చేస్తే, అందులో 50 టీఎంసీలు తిరిగి సముద్రం పాలయ్యాయని ఆయన గణాంకాలతో వివరించారు. కాళేశ్వరం అవినీతిపై సీబీఐ విచారణ కోరినప్పటికీ, బీఆర్ఎస్ , బీజేపీల మధ్య ఉన్న అంతర్గత 'ఫెవికల్' బంధం వల్లే విచారణ ముందుకు సాగడం లేదని మంత్రి ఆరోపించారు.



కేంద్ర సంస్థల నివేదికల ఆధారంగానే తాము జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్‌ను ఏర్పాటు చేశామని, కానీ దీనిపై అసెంబ్లీలో చర్చ జరిగే సమయంలో ప్రతిపక్ష సభ్యులు పారిపోయారని దుయ్యబట్టారు. సభలో చర్చకు రమ్మంటే కుంటిసాకులు చెప్పే బావబావమరుదులు బయట మాత్రం అచ్చోసిన ఆంబోతుల్లా రంకెలు వేస్తున్నారని పొంగులేటి ఘాటుగా విమర్శించారు. నిత్యం పెయిడ్ ఆర్టిస్టులతో సోషల్ మీడియాలో విషం చిమ్ముతూ, శవాల మీద చిల్లర ఏరుకునే రకంగా ప్రతిపక్షం వ్యవహరిస్తోందని మండిపడ్డారు. ప్రజలు వీరి నిజస్వరూపాన్ని చూశారు కాబట్టే అన్ని ఎన్నికల్లో ఓడగొట్టారని గుర్తు చేశారు. తెలంగాణ ప్రయోజనాల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం రాజీ పడదని మంత్రి స్పష్టం చేశారు. కృష్ణా పరివాహక ప్రాంత నీటిని నల్గొండ, ఖమ్మం, మహబూబ్ నగర్ వాసులకు అందించడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. గత ప్రభుత్వ స్వార్థ నిర్ణయాల వల్ల రాష్ట్రం 15 ఏళ్లు వెనక్కి పోయిందని, రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్రాన్ని మరో 15 ఏళ్లు ముందుకు తీసుకెళ్తామని ధీమా వ్యక్తం చేశారు. ప్రాజెక్టుల పనులపై చర్చకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని, ప్రతిపక్షం దమ్ముంటే అసెంబ్లీకి రావాలని ఆయన సవాల్ విసిరారు.

**వెలుగుమట్ల బాధితులకు న్యాయం చేస్తాం**

ఖమ్మం వెలుగుమట్ల ఘటనపై మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పందించారు. పేదలు కాంగ్రెస్ పేటెంట్ అని వ్యాఖ్యానించారు. తమది పేదల ప్రభుత్వమని తెలిపారు. తెలంగాణ హైకోర్టు ఆర్డర్ మేరకు వెలుగుమట్లలో భూదాన్ భూములని కులగొట్టింది వాస్తవమేనని చెప్పుకొచ్చారు. వెలుగుమట్లలో 2023లో బీఆర్ఎస్ కూడా అక్కడ ఇళ్లు కూలగొట్టిందని ప్రస్తావించారు. ఖమ్మంలో నష్టపోయిన నిరుపేదలందరికీ న్యాయం చేస్తామని భరోసా కల్పించారు. అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామని మాటిచ్చారు. ఎవ్వరూ ఆందోళన చెందాల్సిన పనిలేదన్నారు. కేటీఆర్ అండ్ కో చేసే గ్లోబల్ ప్రచారాన్ని ఎవరు నమ్మొద్దని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సూచించారు. ప్రతిపక్ష నాయకుడు కేసీఆర్ అసెంబ్లీకి రమ్మంటే రారని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. తెలంగాణ హక్కులు వదులుకోమని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పారని అన్నారు. అయినా వారి యూట్యూబులతో వంకర మాటలు మాట్లాడుతున్నారని దుయ్యబట్టారు. కేసీఆర్ హయాంలో కమిషన్ వచ్చే పనులు మాత్రమే చేశారని.. అయినా ఆ ప్రాజెక్టులను తాము సరిచేస్తున్నామని చెప్పుకొచ్చారు. వచ్చే నెల 16వ తేదీ నుంచి అసెంబ్లీ ప్రారంభం అవుతోందని.. పారిపోకుండా రండి అన్ని అంశాలపై చర్చిద్దామని సవాల్ విసిరారు. ప్రధాన ప్రతిపక్ష నేత కేసీఆర్ కూడా రావాలని ఛాలెంజ్ చేశారు. కేసీఆర్ స్వార్థం వల్ల రాష్ట్రం 15ఏళ్లు వెనక్కి వెళ్లిందని ఆగ్రహించారు.

## మొదటి పేజి తరువాయి

### భారీగా ఐఏఎస్‌ల బదిలీలు

విభాగం కార్యదర్శిగా గౌరవ్ ఉప్పల్, దేవాదాయశాఖ కమిషనర్‌గా ఎం.హనుమంతరావు, ప్రజావాణి రాష్ట్ర నోడల్ అధికారిగా డి.దివ్యను ప్రభుత్వం నియమించింది. వీరితో పాటు పలు జిల్లా కలెక్టర్లనూ ప్రభుత్వం బదిలీ చేసింది. యాదాద్రి భువనగిరి కలెక్టర్‌గా అనురాగ్ జయంతిని నియమించింది. పంచాయతీరాజ్ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీగా సంజయ్ కుమార్‌ను నియమించారు. విపత్తు నిర్వహణ, రెవెన్యూ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీగా దాన కిషోర్‌కు బాధ్యతలు అప్పగించారు. ఇరిగేషన్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీగా శ్రీధర్‌ను నియమించారు. ఎండోమెంట్స్ కమిషనర్‌గా హనుమంతరావుకు కొత్త బాధ్యతలు అప్పగించారు. ఫైనాన్స్ శాఖ సెక్రటరీగా గౌరవ్ ఉప్పల్‌ను నియమించారు. ఐటీ, పరిశ్రమల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీగా ఎన్.శ్రీధర్‌కు బాధ్యతలు అప్పగించారు. కరీంనగర్ జిల్లా కలెక్టర్‌గా చిత్రా మిశ్రాను నియమించారు. విజయేంద్ర - మహబూబ్‌నగర్ కలెక్టర్ పదవి నుంచి సోషల్ వెల్ఫేర్ శాఖ కార్యదర్శిగా నియామకం అయ్యారు. అద్వైత్ కుమార్ సింగ్ - మహబూబాబాద్ నుంచి ఢిల్లీ తెలంగాణ భవన్ సమన్వయ శాఖకు బదిలీ అయ్యారు. సిక్తా పట్నాయక్ - నారాయణపేట్ నుంచి ఆర్థిక శాఖకు ప్రత్యేక కార్యదర్శిగా బదిలీ అయ్యారు. సందీప్ కుమార్ ఝా - జనగాం కలెక్టర్‌గా నియామకం అయ్యారు. ముష్రఫ్ అలీ ఫారూఖీ - టీఎస్‌జీపీడీసీఎల్ సీఎండీగా నియామకం అయ్యారు. జితేష్ వి.పాటిల్ - టీఎస్‌జీపీడీసీఎల్ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్‌గా బదిలీ అయ్యారు. స్నేహ శబరీష్ - మహబూబాబాద్ కలెక్టర్‌గా నియామకం అయ్యారు. గరిమా అగర్వాల్- రాజన్న సిరిసిల్ల కలెక్టర్‌గా నియామకం జరిగింది. ప్రతిమ సింగ్ - మెదక్ కలెక్టర్‌గా పోస్టింగ్ ఇచ్చారు. అనికేత్ - భద్రాద్రి కొత్తగూడెం కలెక్టర్‌గా ,చాహత్ బజ్పాయి - హనుమకొండ కలెక్టర్‌గా,ఖుష్బూ గుప్తా - మహబూబ్‌నగర్ కలెక్టర్‌గా , పమేలా సత్పతి - లేబర్ కమిషనర్‌గా, అనురాగ్ జయంతి - యాదాద్రి కలెక్టర్‌గా ,ప్రదీప్ జైన్ - నారాయణపేట్ కలెక్టర్‌గా నియామకం జరిగింది.

### గ్రేహౌండ్స్.. ఎస్ఐబీ ఇక చరిత్ర గతిలోకి!

పోషిస్తున్న కమెండో దళం గ్రేహౌండ్స్, ప్రత్యేక నిఘా విభాగం (ఎస్ఐబీ)ల పాత్ర పరిమితం కాబోతోంది. సిబ్బంది సంఖ్య, వీటిపై పెడుతున్న ఖర్చునూ కుదించనున్నారు. క్రమక్రమంగా ఇవి కనుమరుగుకానున్నాయి. రాష్ట్రంలో మావోయిస్టులే లేరని చెబుతున్నప్పుడు..వారి కోసమే ఏర్పాటు చేసిన వ్యవస్థల అవసరం ఏముందని ఇటీవల జరిగిన ఉన్నతస్థాయి సమావేశంలో ప్రభుత్వం ప్రశ్నించినట్లు తెలుస్తోంది. మరో పక్క వామపక్ష తీవ్రవాదంపై పోరాడేందుకు ఏర్పాటు చేసిన ప్రత్యేక విభాగాలను రద్దు చేయాలని కేంద్ర ప్రభుత్వం అన్ని రాష్ట్రాలకూ తాజాగా లేఖ రాసినట్లు తెలుస్తోంది.

**గ్రేహౌండ్స్ రూపకర్త వ్యాస్**

పశ్చిమబెంగాల్‌లోని నక్సల్‌బరిలో పుట్టిన నక్సలైట్ ఉద్యమం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీకాకుళంలో ప్రవేశించి ఆ తర్వాత మిగతా ప్రాంతానికి ముఖ్యంగా తెలంగాణకు విస్తరించింది. చూస్తుండగానే ఈ ఉద్యమం ప్రభుత్వానికే సవాలు విసిరే స్థాయికి చేరింది. గెరిల్లా దాడులతో హడలెత్తిస్తున్న వీరిని అదే తరహాలో ఎదుర్కోవాలన్న ఉద్దేశంతో ఐపీఎస్ అధికారి వ్యాస్ గ్రేహౌండ్స్ విభాగానికి రూపకల్పన చేశారు. అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం ఇచ్చిన సహకారంతో దాదాపు 700 ఎకరాల్లో శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు.

- నక్సలైట్లు అడవుల్లో ఉండి ఎలా దాడులు చేస్తారో అలానే ఎదురుదాడులు చేసేలా గ్రేహౌండ్స్ కమాండోలకు శిక్షణ ఇస్తారు. పోలీసుశాఖలో కొత్తగా వచ్చే వారిలో ఆసక్తి గలవారిని ఎంపిక చేసి కఠిన శిక్షణ ఇచ్చి కమెండోలుగా తీర్చిదిద్దుతారు. ఆరు రోజులపాటు అడవుల్లో మనగలిగేలా, రాత్రీపగలూ తేడా లేకుండా రోజుకు కనీసం 20 కిలోమీటర్లు నడవగలిగేలా, ప్రత్యేక ఆయుధాలు ఉపయోగించగలిగేలా శిక్షణ ఇస్తారు. గెరిల్లా వార్ ఫేర్‌లో గ్రేహౌండ్స్ విభాగానికి ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు ఉంది. అమెరికాతో పాటు అనేక దేశాలకు చెందిన నిపుణులు దీని పనితీరును పరిశీలించారు.
- ప్రాణాలు పణంగా పెట్టి ఇక్కడ పనిచేయాల్సి ఉంటుంది కాబట్టి గ్రేహౌండ్స్‌లోకి వచ్చేవారికి ప్రత్యేక అలవెన్సులిస్తారు. మామూలు పోలీసులతో పోల్చుకుంటే సీఐ నుంచి కిందిస్థాయి సిబ్బందికి 60 శాతం, డీఎస్పీ ఆ పైస్థాయి వారికి 50 శాతం వేతనం అధికంగా చెల్లిస్తారు. దాంతో పాటు ఏదైనా ప్రమాదం జరిగితే ఎంత ఖర్చయినా ప్రభుత్వమే భరిస్తుంది. మరణిస్తే ఆ కుటుంబంలో ఒకరికి ఉద్యోగం, ఇంటి స్థలం ఇవ్వడంతో పాటు మరణించిన ఉద్యోగి విధుల్లో ఉన్నట్లే పరిగణించి, పదవీ విరమణ వయసు వచ్చే వరకూ ఆ కుటుంబానికి నెలనెలా వేతనం చెల్లిస్తుంది. అందుకే గ్రేహౌండ్స్‌కు బడ్జెట్‌లో ప్రత్యేక నిధులిస్తారు. గత ఏడాది ఈ విభాగానికి రూ.34.91 కోట్లు కేటాయించారు. ఉమ్మడి రాష్ట్రంలో మొత్తం మూడు వేల మంది కమెండోలు ఉండేవారు. ఇప్పుడు తెలంగాణలో ఆ సంఖ్య దాదాపు 1500.
- అడవుల్లో ఉండి అకస్మాత్తుగా దాడులు జరిపి, తేరుకునేలోపు పారిపోయే వామపక్ష తీవ్రవాదుల ఆచూకీ, వారి ఎత్తుగడలు తెలుసుకోవడం కూడా మామూలు విషయం కాదు. ఇందుకోసం ప్రత్యేకంగా నిఘా విభాగంలో స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్రాంచి (ఎస్ఐబీ)ని ఏర్పాటు చేశారు. ఇందులో పనిచేసే సిబ్బంది సొంత సమాచార వ్యవస్థతో ఎప్పటికప్పుడు మావోయిస్టుల కదలికలను పసిగడతారు. ఈ సమాచారం ఆధారంగానే గ్రేహౌండ్స్ కమెండోలు దాడులకు దిగేవారు. గ్రేహౌండ్స్‌కు ఇచ్చే రాయితీలన్నీ ఎస్ఐబీ వారికి కూడా ఇస్తున్నారు. ప్రస్తుతం తెలంగాణ ఎస్ఐబీలో సుమారు 100 మంది పనిచేస్తున్నారు. రాష్ట్రంలో మావోయిస్టు ఉద్యమం ఇంచుమించు కనుమరుగవడం, ఇంకో 11 మంది మాత్రమే మిగిలారని డీజీపీ శివధర్‌రెడ్డి స్వయంగా ప్రకటించిన సంగతి తెలిసిందే. దీంతో మావోయిస్టులే లేనప్పుడు గ్రేహౌండ్స్, ఎస్ఐబీ ఎందుకు అనే ప్రశ్న మొదలైంది. ఇదిలా ఉంటే వామపక్ష తీవ్రవాదంపై పోరాడేందుకు కేంద్ర ప్రభుత్వం కూడా బాధిత రాష్ట్రాలకు పెద్దఎత్తున నిధులిచ్చేది. ఇకమీదట ఈ నిధులు ఆపేస్తామని అనధికారికంగా చెప్పిన కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక విభాగాలను ఎత్తేయాలని లేఖ రాసినట్లు సమాచారం. దాంతో పోలీసుశాఖలో ప్రతిష్ఠాత్మకమైన గ్రేహౌండ్స్, ఎస్ఐబీలు క్రమంగా కనుమరుగయ్యే అవకాశం ఉంది.

### ప్రభుత్వ పథకాల అమలు బాధ్యత మీదే

అన్నారు. బాగా చదువుకున్న వాళ్లను టీజీపీఎస్సీలో నియమించాం. అన్ని జాగ్రత్తలతో పరీక్షలు నిర్వహించి ఫలితాలు ప్రకటించాం. మీరంతా శిక్షణ పూర్తి చేసుకొని ఉద్యోగాల్లో చేరుతున్నారు. ప్రభుత్వం మిమ్మల్నే రాష్ట్ర ప్రతినిధులుగా భావిస్తోంది. మీ ద్వారానే ప్రభుత్వ పథకాలు అమలవుతాయి. మేం ఎన్ని పాలసీలు చేసినా.. దాని అమల్లో మీరే చాలా ముఖ్యం. బాధ్యతాయుతమైన పదవుల్లో చేరుతున్నారు. ఉద్యోగవిరమణ రోజు వరకు ఇదే స్ఫూర్తితో పని చేయాలి' అని దిశానిర్దేశర చేశారు.

తెలుగు దినపత్రిక

https://aksharagalam.com

అక్షరగళం

ప్రతి అక్షరం ప్రజల కోసం

గ్రేటర్ -హైదరాబాద్

శుక్రవారం 27 , ఫిబ్రవరి 2026 పేజీలు 8





## లైబ్రరీ ఏర్పాటు స్థలాన్ని పరిశీలించిన నాయకులు

**కల్వకుర్తి ఫిబ్రవరి 26 (అక్షర గలం):**

కల్వకుర్తి పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో నూతనంగా ఏర్పాటు చేయనున్న లైబ్రరీ భవన నిర్మాణానికి సంబంధించి స్థలాన్ని మాజీ సర్పంచ్ ఆనంద్ కుమార్, మున్సిపాలిటీ వైస్ ఛైర్మన్ షానవాజ్ ఖాన్ తదితరులు గురువారం పరిశీలించారు. ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి చొరవ వల్ల లైబ్రరీ భవన నిర్మాణానికి నిధులు మంజూరు అయినట్లు వారు తెలిపారు. పరిశీలించిన వారిలో కౌన్సిలర్ మబ్బు రామరాజు తదితరులు ఉన్నారు.



## మహబూబ్ నగర్ జిల్లా అదనపు కలెక్టర్ గా హరిప్రియ

**అక్షర గళం, మేడ్చల్ ప్రతినిధి :**

మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కలెక్టరేట్ డిఆర్ఓ హరిప్రియ పదోన్నతి పై అదనపు కలెక్టర్ గా మహబూబ్ నగర్ జిల్లా కలెక్టరేట్ కు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కలెక్టర్ మన చౌదరి డిఆర్ఓ ను శాలువా పూల మొక్కతో సన్మానించారు.



## కుమ్మెర' ఘటనలో దోషులను కఠినంగా శిక్షించాలి'

### నాగిళ్ల తిరుపతయ్య

**ఆమనగలు, ఫిబ్రవరి 26 (అక్షర గళం):**

నాగర్ కర్నూల్ మండలం కుమ్మెర జాతర సందర్భంగా జరిగిన రజక కుటుంబాన్ని టార్గెట్ చేస్తూ గ్రామ పెత్తందారులు అనుసరించిన తీరు సమాజాన్ని తలదించుకునే విధంగా ఉందని రెండు నెలల పసికందు మరణానికి కారకులైన రెడ్డి సామాజిక వర్గానికి చెందిన 8 మందిని వెంటనే అరెస్టు చేసి శిక్షించాలని తెలంగాణ రాష్ట్ర రజక ఐక్యవేదిక సంఘం సభ్యులు, ఆమనగలు మున్సిపల్ రజక సంఘం ప్రధాన కార్యదర్శి నాగిళ్ల తిరుపతయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం ఆమనగల్లు పట్టణంలో తిరుపతయ్య మాట్లాడుతూ.. కుమ్మెర గ్రామంలో రెండు నెలల పసిబిడ్డను అత్యంత క్రూరంగా అమానవీయంగా కాలితో తన్ని హత్య చేసిన ఆ గ్రామ పెత్తం దారులను ఎస్సీ ఎస్టీ అత్యాచార నిరోధక చట్టంతోపాటు హత్య నేరం కింద కేసు నమోదు చేసి తక్షణమే రిమాండ్ చేయాలన్నారు. లేని యెడల రజక సంఘం ఆధ్వర్యంలో రాష్ట్ర మొత్తం ఆందోళన కార్యక్రమం నిర్వహిస్తామని తిరుపతయ్య హెచ్చరించారు. సమావేశంలో రజక సంఘం మండల నాయకులు నాగిళ్ల బుచ్చయ్య ఉన్నారు.



## కన్నుల పండువగా శ్రీ వెంకటేశ్వర స్వామి రథోత్సవం

**ఆమనగల్లు, ఫిబ్రవరి 26 (అక్షర గళం):**

ఆమనగల్లు పట్టణంలోని శ్రీ వేంకటగిరి వేంకటేశ్వరస్వామి దేవాలయంలో గురువారం స్వామి రథోత్సవం ఆలయ ధర్మకర్త గూడ కృష్ణమాచార్యులు ఆధ్వర్యంలో కన్నులపండువగా నిర్వహించారు. ఉదయం దివ్యమంగళ హారతుల మధ్య శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామిని పుష్పాలతో, పతాకాలతో అలంకరించిన మహారథంలో భక్తులకు దర్శనం కల్పించారు. భక్తులు మంగళ హారతులు సమర్పించి స్వామి వారికి మొక్కులు చెల్లించుకున్నారు. కాగా రథోత్సవం వేల గోవిందా గోవిందా నామస్మరణ పరిసర ప్రాంతాల్లో మారు మ్రోగింది. భక్తుల భజనలు, కోలాటాలు పలువురిని ఆకర్షించాయి. వేడుకల్లో అర్చకులు రాధాకృష్ణ శర్మ, అనిల్ జోషి, జానకి రామయ్య, ఆనంద శర్మ, నిహాల్ జోషిలు మరియు ప్రముఖ సంఘ సేవకులు, 5వ వార్డు కౌన్సిలర్ పాపిశెట్టి రాము, 12వ వార్డు కౌన్సిలర్ నాగిళ్ళ జగన్, బిక్కుమండ్ల నర్సింహా, ఎంగలి శ్రీధర్, సుదీప్, సైదులు గౌడ్, శ్రీను నాయక్, పూసల భాస్కర్, రాజు, యాదగిరి, హరీష్, రవి తదితరులు ఉన్నారు.

## సొంతింటి కల నెరవేర్చడమే కాంగ్రెస్ ప్రభుత్వం లక్ష్యం





### సిఎం సోదరులు ఎనుముల తిరుపతి రెడ్డి, కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి, అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణ

**వెల్దండ ఫిబ్రవరి 26 (అక్షర గళం):**

ప్రజా ప్రభుత్వం ద్వారానే పేదల సొంతింటి కల నెరవేరుతుందని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. గురువారం వెల్దండ మండల కేంద్రంలోని ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ కార్యక్రమం నిర్వహించగా ముఖ్య అతిథులుగా హాజరైన ఎనుముల తిరుపతి రెడ్డి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణ, సర్పంచ్ మట్ట యాదమ్మ వెంకటయ్య గౌడ్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు వెల్దండ మాజీ సర్పంచ్ ఎన్నం భూపతిరెడ్డి ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షులు బచ్చు రామకృష్ణ కల్వకుర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఉమా మనీలా సంజీవ్ కుమార్ యాదవ్ లతో కలిసి సీఎం సోదరులు ఎనుముల తిరుపతిరెడ్డి రిబ్బన్ కట్ చేసి ఇంటి ప్రారంభోత్సవం చేశారు. తమ నూతన



గృహప్రవేశ కార్యక్రమానికి హాజరైన ముఖ్య అతిథులుకు ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారు రాంపురం శ్రీను దంపతులు శాలువాతో ఘనంగా సత్కరించారు. ఇందిరమ్మ ఇల్లు నిర్మాణం పూర్తి చేసుకొని గృహప్రవేశం చేసిన లబ్ధిదారులకు ఎమ్మెల్యే శాలువాతో సన్మానించి, శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల పంపిణీ కార్యక్రమంలో అర్హులైన ప్రతి ఒక్క నిరుపేద కుటుంబానికి సొంతింటి కల నెరవేరుతుందని అన్నారు. పార్టీలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికి విడతల వారిగా ఇందిరమ్మ ఇళ్లను అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వెల్దండ ఉప సర్పంచ్ ఎర్ర శ్రీను తహసిల్దార్ కార్తీక్ కుమార్ జియాగూడ ఎంపీడీవో సత్యపాల్ రెడ్డి యాదవ సంఘం అధ్యక్షులు జక్కుల చిన్న జంగయ్య యాదవ్ పంచాయతీ కార్యదర్శి గిరి నాయకులు పర్వత్ రెడ్డి కొయ్యల పుల్లయ్య వార్డు నెంబర్ సభ్యులు గుద్దేటి కిష్టాల్ పురుషోత్తం చారి ముదిగొండ రమేష్ రంగనాథం మసిగుండ్ల వెంకటేష్ యాదయ్య మల్లేష్ శేఖర్ తదితరులు పాల్గొన్నారు

## రక్షణ చట్టం వెంటనే అమల్లోకి తేవాలి



### ఆమనగల్లు బార్ అధ్యక్షుడు యాదిలాల్

**ఆమనగల్లు, ఫిబ్రవరి 26 (అక్షర గళం):**

న్యాయవాదుల రక్షణ చట్టాన్ని ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని అలంపూర్ నుండి చలో సెక్రటియర్ ముట్టడి కోసం పాదయాత్రతో వెళ్తున్న అలంపూర్ బార్ అసోసియేషన్ న్యాయవాదులను గురువారం ఆమనగల్లు బార్ అసోసియేషన్ అధ్యక్షులు అండేకార్ యాదిలాల్ పాలమాకుల వద్ద కలిశారు. పాదయాత్ర చేస్తున్న న్యాయవాదులను పూలమాలలు శాలువాలతో ఆయన సత్కరించారు. న్యాయవాదుల రక్షణ చట్టం అమలు జరిగే వరకు తమ పోరాటం కొనసాగుతుందని ఆయన పేర్కొన్నారు. అదేవిధంగా కల్వకుర్తి బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదుల రక్షణ చట్టం అమలు కోసం కోర్టు ఆవరణలో చేపట్టిన రిలే నిరాహార దీక్షను ఆమనగల్లు న్యాయవాదులతో కలిసి సందర్శించారు. వారికి సంఘీభావం తెలియజేశారు. కల్వకుర్తి బార్ అసోసియేషన్ దీక్షకు ఆమనగల్లు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో తమ పూర్తి మద్దతు తెలియజేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు కల్వకుర్తి బార్ అసోసియేషన్ అధ్యక్షులు నరేందర్ రెడ్డి, లక్ష్మణ్ శర్మ, మల్లేపల్లి జగన్, చిందం కృష్ణయ్య, వెంకట్ గౌడ్, ఆంజనేయులు, రామకృష్ణ ఆంజనేయులు, శివకుమార్, జంగయ్య, ప్రశాంత్, శ్రీకాంత్, మధు, కృష్ణ, మల్లేష్ తదితరులు ఉన్నారు.



## మృతుడి కుటుంబానికి అండగా

**ఆమనగల్లు, ఫిబ్రవరి 26 (అక్షర గళం):**

కడ్తాల్ మండల కేంద్రంలోని గానుగుమర్ల తండా గ్రామపంచాయతీ పరిధిలోని పోచమ్మ గడ్డ తండాకు చెందిన జర్పుల సేవ్య నాయక్ గురువారం అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులు రాధాకృష్ణ మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ జర్పుల దశరథ్ నాయక్, తండా సర్పంచ్ సేవ్య నాయక్ మృతుడి పార్థివ దేహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపి మనోధైర్యం కల్పించారు. వారి వంతు సహాయంగా దశరథ్ నాయక్ 5 వేల రూపాయలు, సర్పంచ్ సేవ్య నాయక్ 10వేల రూపాయలు సమకూర్చి మృతుడి కుటుంబ సభ్యులకు 15 వేల రూపాయలు అందజేశారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ లక్ పతి, నాయకులు టిక్ లాల్ శంకర్, సేవ్య, కిషన్, తేజు, నవీన్, రాము, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

## పసిబిడ్డ ప్రాణం పోవడానికి కారణమైన వారిని వెంటనే శిక్షించాలి

### బీఆర్ఎస్ నాయకులు గుబ్బల లక్ష్మీనారాయణ

**అక్షర గళం, కుత్బుల్లాపూర్ :**

పసిబిడ్డ ప్రాణం పోవడానికి కారణమైన వారిని వెంటనే శిక్షించాలని బీఆర్ఎస్ నాయకులు గుబ్బల లక్ష్మీనారాయణ డిమాండ్ చేశారు. నాగర్‌కర్నూల్ లో పసికందు మరణంపై బీఆర్ఎస్ నాయకులు గుబ్బల లక్ష్మీనారాయణ ధ్వజం మెత్తారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాగర్‌కర్నూల్ ఘటనలో రెండు నెలల పసికందు మరణం కేవలం కొందరు వ్యక్తులు చేసిన దాడి మాత్రమే కాదు అని ఇది ముమ్మాటికీ ప్రభుత్వ నిర్లక్ష్యం వైఫల్యం అని గుబ్బల లక్ష్మీనారాయణ ఆవేదన వ్యక్తం చేశారు. నాగర్‌కర్నూల్ జిల్లా కుమ్మరి మల్లన్న జాతరలో జరిగిన అమానుష ఘటనను తీవ్రంగా



ఖండిస్తున్నామన్నారు. శాంతి భద్రతల పరిరక్షణలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. ఈ దాడికి పాల్పడ్డ ప్రధాన నిందితులు అధికార కాంగ్రెస్ పార్టీకి చెందిన వారనే కారణంతోనే ప్రభుత్వం వారిని కాపాడటానికి ప్రయత్నిస్తోంది అని ముఖ్యమంత్రి సొంత జిల్లాలో ఇంత దారుణం జరిగినా, ప్రభుత్వం మౌనంగా ఉండటం నిందితులకు వత్తాసు పలకడమేనని అన్నారు. పోలీసుల పక్షపాత వైఖరి నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాల్సింది పోయి, బాధితులపైనే ఎదురు కేసులు పెట్టడం పోలీసుల నిర్లక్ష్యానికి పరాకాష్ట అన్నారు. అధికార పార్టీ నేతల ఒత్తిడికి తలొగ్గి పోలీసులు బాధితులను వేధిస్తున్నారని, ఇటువంటి ఘటనలు జరగకుండా చూడాలని గుబ్బల లక్ష్మీనారాయణ ఆవేదన వ్యక్తం చేశారు. నిందితులను ఫాస్ట్ ట్రాక్ కోర్టు ద్వారా జైలుకు పంపాలని. బాధిత కుటుంబానికి భారీ ఎక్స్ గ్రేషియా ప్రకటించాలని గుబ్బల లక్ష్మీనారాయణ డిమాండ్ చేశారు.

# చట్టంలోని నిబంధనలను పాటించని పక్షంలో సంబంధిత కేంద్రాలపై చట్టప్రకారం కఠిన చర్యలు

## మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా సంక్షేమ అధికారి

**అక్షరగళం, మేడ్చల్ ప్రతినిధి :**

చట్టంలోని నిబంధనలను పాటించని పక్షంలో సంబంధిత కేంద్రాలపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోబడతాయని మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా సంక్షేమ అధికారి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దివ్యాంగుల హక్కుల చట్టం, 2016 లోని విభాగం 51 ప్రకారం దివ్యాంగులకు సేవలు, చికిత్స, శిక్షణ, పునరావాసం, సంరక్షణ లేదా మద్దతు అందించే అన్ని సంస్థలు తప్పనిసరిగా నమోదు చేసుకోవలసి ఉంటుందన్నారు. దివ్యాంగుల హక్కుల చట్టం, 2016 ప్రకారం ఆటిజం , పిల్లల అభివృద్ధి కేంద్రాలకు నమోదు తప్పనిసరి చేసుకోవాలన్నారు. కొన్ని కేంద్రాలు సంబంధిత అధికారుల నుండి అవసరమైన నమోదు పొందకుండానే పనిచేస్తున్నట్లు గమనించబడింది. అటువంటి కేంద్రాలన్నీ వెంటనే మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా సంక్షేమ అధికారి కార్యాలయంలో నమోదు కోసం దరఖాస్తు చేసుకోవాలని ఆదేశించారు. అవసరమైతే కేంద్రాలను మూసివేయడం , స్వాధీనం చేసుకోవడం వంటి చర్యలు కూడా చేపట్టబడతాయి.అందువల్ల సంబంధిత సంస్థలు ఈ విషయాన్ని అత్యవసరంగా పరిగణించి ఎలాంటి శిక్షార్హ పరిణామాలు ఎదురుకాకుండా వీలైనంత త్వరగా నమోదు ప్రక్రియను పూర్తి చేయాలని జిల్లా సంక్షేమ అధికారి విజ్ఞప్తి చేశారు.



# నర్సరీ పనులను ప్రారంభించిన సర్పంచ్

**ఆమనగల్లు, ఫిబ్రవరి 26 (అక్షర గళం):**

ఆమనగల్లు మండల పరిధిలోని సింగంపల్లి గ్రామంలో నర్సరీ పనులను గురువారం సర్పంచ్ శానమోని సత్యం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నాణ్యమైన విత్తనాలు నాటి, లక్ష్యానికి అనుగుణంగా పూలు, పండ్ల మొక్కలను పెంచాలని సిబ్బందికి సూచించారు. నాటిన ప్రతి మొక్కను సంరక్షించడం అందరి బాధ్యత అన్నారు. ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామంలో అర్హులైన వారికి పని కల్పించడంతో పాటు గ్రామానికి అవసరమైన అభివృద్ధి పనులను దశలవారీగా చేపడుతామని పేర్కొన్నారు. అలాగే గ్రామంలో అవసరమైన మొక్కలను స్థానికంగానే పెంచే ఉద్దేశంతో నర్సరీ ఏర్పాటు చేయడం వల్ల హరితాభివృద్ధికి బలమైన పునాది పడుతుందని అన్నారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ సీహెచ్ రవీంద్ర, వార్డు సభ్యులు అయోధ్య, సదానందం, తానేష, జ్యోతి గ్రామస్తులు పాల్గొన్నారు.

# ఇసుక రిచ్ లపై సందేహాలు ఉంటే సంబంధిత అధికారులతో నివృత్తి చేసుకోండి

## మీడియాకు సూచన కల్వకుర్తి సిఐ బి. నాగార్జున

**కల్వకుర్తి ఫిబ్రవరి 26 (అక్షర గళం):**



ఇసుకరిచుల పై సందేహాలు ఉంటే సంబంధిత అధికారుల ద్వారా సమాచారాన్ని సేకరించి వివరణ కోరుతూ వార్తలను ప్రచూరించాలని కల్వకుర్తి సీఐ బి. నాగార్జున మీడియాకు ఒక ప్రకటనలో తెలిపారు గురువారం కల్వకుర్తి మండల పరిధిలోని లింగసానిపల్లి లో ఇసుక రిచ్ ఏ ఏ రోజులలో ప్రారంభిస్తున్నారు ఇప్పటివరకు నడుస్తుందో అదే విధంగా ఏ సమయం వరకు ఇసుకను ముగింపు మొదలైన వివరాలన్నీ సంబంధిత శాఖ అధికారుల ద్వారా జరుగుతుందని మీడియాకు ఇసుక గురించి ఏదైనా వార్త రాసేటప్పుడు సంబంధిత అధికారులను సంప్రదించాలని సూచించారు. ప్రభుత్వ పథకం (మన ఇసుక మన వాహనం) ద్వారా ఇసుకరించు నడిచిందా లేదా అని సమాచారాన్ని స్వీకరించి సంబంధిత వార్తలు ప్రచురించాలని కొన్నిసార్లు ఇసుక రిచ్ పై నడుస్తున్నప్పటికీ కొంతమంది మీడియా రిపోర్టర్లకు తెలియక పోవడం వల్ల రిపోర్టర్లు అయోమయానికి లోనవుతున్నారని సరైన సమాచారం కోసం మైనింగ్ అధికారుల ఫోన్ నెంబర్లు శ్రీకాంత్ ఇసుక రిచ్ ఆఫీసర్, 6305668494,ఆనందు ఏ ఎస్ ఆర్ ఓ 8897758018, మరియు తాసిల్దార్ ను సంప్రదించాలని సిఐ వివరణ ఇచ్చారు.

# జర్నలిస్టుల సంక్షేమానికి తన వంతుగా రాజీలేని కృషిని కొనసాగిస్తా



## ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

**కుషాయిగూడ,ఫిబ్రవరి 26, (అక్షర గళం) :**

జర్నలిస్టుల సంక్షేమానికి తన వంతుగా రాజీలేని కృషిని కొనసాగిస్తానని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పేర్కొన్నారు.ఏకగ్రీవంగా ఎన్నికైన కాప్రా ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గం గురువారం ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డిని మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... సమాజ హితం కోసం కాప్రా ప్రెస్ క్లబ్ జర్నలిస్టులు సాగిస్తున్న కృషి అభినందనీయమని ప్రశంసించారు.ఈ కార్యక్రమంలో కాప్రా ప్రెస్ క్లబ్ సలహాదారులు ఎంపల్లి పద్మారెడ్డి, బెలిదే అశోక్, అధ్యక్షులు మెరుగు చంద్రమోహన్, ఉపాధ్యక్షులు దిలీప్ కుమార్, యావాపురం రవి, దొమ్మాటి కిరణ్ కుమార్, గార్లపాటి శ్రీనివాస్ రావు, ప్రధాన కార్యదర్శి ముత్యం ముఖేష్ గౌడ్, సంయుక్త కార్యదర్శులు డి. శ్రీనివాస్, కె. వెంకట్, ఆర్గనైజింగ్ కార్యదర్శులు ఓ. నరసింహ, కీర్తి శ్రీనివాస్, కోశాధికారి రామచంద్రమూర్తి, కార్యవర్గ సభ్యులు గంగి కృష్ణ, గోవిందు కుంట్ల ఆంజనేయులు, బుడంపల్లి నిరంత్ గౌడ్, తొడుపునూరు బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# మౌలిక సదుపాయాలు కల్పించాలని కమిషనర్ కు వినతి

**ఆమనగల్లు, ఫిబ్రవరి 26 (అక్షర గళం):**



ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోని 4వ వార్డు జంగారెడ్డిపల్లిలో సీసీ రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, మంచి నీరు, శ్మశాన వాటికలో స్నానపు గదులు, వాటర్ ట్యాంకులు వంటి మౌళిక సదుపాయాలు చేపట్టాలని ఆ వార్డు కౌన్సిలర్ దుడ్డు కృష్ణ యాదవ్ కోరారు. ఈ మేరకు గురువారం మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ శంకర్ నాయక్ కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ ఆంజనేయులు యాదవ్ మాట్లాడుతూ.. జంగారెడ్డి పల్లిలో మౌళిక సదుపాయాలు లేక ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని అవేదన వ్యక్తం చేశారు. కాలనీలో రోడ్లులన్నీ గుంతలుగా ఉన్నాయని, వర్షపు నీరు నిల్వ ఉండి, మురికి నీరు కాలనీలో రోడ్లపైనే ఉండటం వలన దోమలు, పందులు, స్వైర విహారం చేసి ప్రజలు అనారోగ్యాల పాలవుతున్నారన్నారు. ఇంటింటికి మంచి నీటి సౌకర్యం, శ్మశాన వాటికలో స్నానపు గదులు, వాటర్ ట్యాంకులు వెంటనే మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు.



# సమాజ శ్రేయస్సుకు పోలీస్ సేవలు ఎనలేనివి

## బదిలీపై వెళ్తున్న ఎస్ఐ వెంకటేష్ కు ఘన సన్మానం

**ఆమనగల్లు, ఫిబ్రవరి 26 (అక్షర గళం):**

సమాజ శ్రేయస్సు కోసం శాంతి భద్రతల పరిరక్షణలో అహర్నిశలు శ్రమిస్తూ ప్రజల రక్షణకు అంకితభావంతో పనిచేసే పోలీసుల సేవలు ఎనలేనివని సీఐ జానకి రామ్ రెడ్డి కొనియాడారు. ఆమనగల్లు పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తూ ఇటీవలే ఫ్యూచర్ సిటీ కమిషనర్ రేట్ కు బదిలీపై వెళ్తున్న ఎస్ఐ వెంకటేష్ కు గురువారం సీఐలు జానకి రామ్ రెడ్డి, గంగాధర్ లు పూలమాల శాలువాతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ.. పోలీస్ ఉద్యోగం అనేది అత్యంత బాధ్యతతో కూడుకున్నదని, క్రమశిక్షణ, నిబద్ధతతో పనిచేసి ఉన్నత స్థానాలకు చేరుకున్న సిబ్బందిని చూసి గర్వంగా ఉందన్నారు. ఆమనగల్లు పరిధిలో ఎస్ఐ వెంకటేష్ అందించిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. కార్యక్రమంలో ఎస్ఐలు వరప్రసాద్, సీతారాం రెడ్డి, ఏ ఎస్ఐ లు రాంరెడ్డి, మురళీధర్ రెడ్డి, సిబ్బంది మల్లేష్, శివారెడ్డి, ప్రతాప్, శ్రీను, ప్రవీణ్, సుజాత తదితరులు ఉన్నారు.

# అర్హులైన ప్రతి పేదకు ఇల్లందించడమే ప్రభుత్వ ధ్యేయం





**కల్వకుర్తి ఫిబ్రవరి 26 (అక్షరం గళం) :**

కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సహకారంతో మంజూరైన ఇందిరమ్మ ఇళ్లకు మున్సిపల్ ఛైర్పర్సన్ రత్నమాల ఆనంద్ కుమార్ గురువారం భూమి పూజ నిర్వహించారు. 3వ, 12వ వార్డులలో వేరువేరుగా భూమి పూజలు చేశారు. ఈ సందర్భంగా ఈ పనులకు శ్రీకారం చుట్టారు. అర్హులైన ప్రతి నిరుపేదకూ ఇందిరమ్మ ఇల్లు అందేలా ఎమ్మెల్యే నిరంతరం కృషి చేస్తున్నారని వారు తెలిపారు.

# యువత క్రీడారంగంలో ఆసక్తిని కనపరచాలి

## ఊరుకొండ యువజన కాంగ్రెస్ నాయకులు జెట్టి హరికృష్ణ

**కల్వకుర్తి ఫిబ్రవరి 26 (అక్షర గళం):**



గ్రామీణ ప్రాంత యువత క్రీడారంగంలో ఆసక్తినికరపరిస్తే జాతీ య స్థాయిలో గుర్తింపు సాధిస్తారని క్రీడాలను ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని ఊరుకొండ యువజన కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు జెట్టి హరికృష్ణ అన్నారు. గురు వారం ఊరుకొండ మండల పరిధిలోని ఇప్పపాడు గ్రామ ంలో యువకుల కోసం వాలీ బాల్ కిట్టును అంద జేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామంలోని యువత క్రీడాల పట్ల నైపుణ్యం పెంపొంది ంచేందుకు ప్రతి ఒక్కరూ క్రీడాలను ప్రాక్టీస్ చేసి క్రీడా రంగంలో పేరు ప్రఖ్యాతల తో పాటు గ్రామ అభివృద్ధి కార్యక్రమాల్లో ప్రోత్స హించడంలో భాగస్వామ్ కావాలని పిలుపునిచ్చారు.





# ప్రజారక్షణ, సమాజ పరిరక్షణలో పోలీస్ అందించే సేవలు ఎనలేనివి

## బదిలీపై వెళ్తున్న ఏఎస్ఐ జి.అశోక్ రెడ్డి,హెడ్ కానిస్టేబుల్ అంబటి సత్యం లకు ఘనంగా వీడ్కోలు

**కుషాయిగూడ, ఫిబ్రవరి 26,(అక్షర గళం) :**

ప్రజారక్షణ, సమాజ పరిరక్షణలో పోలీస్ అందించే సేవలు ఎనలేనివని ఎస్ హెచ్ ఓ ఎల్.భాస్కర్ రెడ్డి అన్నారు.కుషాయిగూడ పోలీస్ స్టేషన్ నుండి మల్కాజిగిరి కి ఎస్ఓటి కి బదిలీపై వెళ్తున్న ఏఎస్ఐ జి.అశోక్ రెడ్డి,హెడ్ కానిస్టేబుల్ అంబటి సత్యం లను కుషాయిగూడ పోలీస్ అధికారులు గురువారం గులాబీ మాలలు వేసి,స్వీట్ బాక్స్ లు శాలువాలతో ఘనంగా సత్కరించారు.ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ. ..కుషాయిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో సమర్ధవంతంగా విధులు నిర్వహించి శాంతిభద్రతల్లో మార్పు తీసుకొచ్చారని కొనియాడారు.అనంతరం పోలీస్ అధికారులు ఘనంగా వీడ్కోలు పలికారు.ఈ కార్యక్రమం లో కుషాయిగూడ ఎస్ హెచ్ ఓ ఎల్.భాస్కర్ రెడ్డి, ఎస్ఐ లు నిమ్మ సుధాకర్ రెడ్డి,వెంకన్న, సాయిలు,సునీల్ రెడ్డి,విజయ్ తదితరులు ఉన్నారు.

# ఎస్సీ షాపింగ్ కాంప్లెక్స్ దుకాణాలు స్థానికులకే కేటాయించాలి





## ఆర్డీవో, తాహసిల్దార్,మున్సిపల్ కమిషనర్ లకు వ్యతిపత్రం అందజేత

**కల్వకుర్తి ఫిబ్రవరి 26 (అక్షర గలం) :**



కల్వకుర్తి పట్టణంలోని బస్టాండ్ సమీపంలో నిర్మించిన ఎస్సీ షాపింగ్ కాంప్లెక్స్ దుకాణాలను స్థానిక ఎస్సీ నిరుద్యోగ యువతీ యువకులకు కేటాయించాలని కోరుతూ స్థానిక ఎమ్మార్వో ఇబ్రహీంతో పాటు ఆర్డీవో కార్యాలయ అధికారికి, మున్సిపల్ కమిషనర్ మహమ్మద్ షేకు లకు వివిధ దళిత సంఘాలకు చెందిన నాయకులు గురువారం వినతిపత్రం అందజేశారు. సి కాంప్లెక్స్ లో 31 శాఖలు నూతనంగా నిర్మించారు గత నాలుగు సంవత్సరాలుగా ప్రారంభానికి నోచుకోలేదు. ప్రభుత్వం ఇచ్చిన నోటిఫికేషన్లలో లబ్ధిదారులు పదో తరగతి పాస్ కావాలనేది ఎత్తివేయాలని పేర్కొన్నారు. కల్వకుర్తి మున్సిపాలిటీ పరిధిలో ఉన్న యువతకు మాత్రమే అవకాశం కల్పించాలని పేర్కొన్నారు.ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొని షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం చేపట్టామని పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఎమ్మార్పీఎస్ నాయకులు వివిధ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# ఆర్థిక సహాయం అందించిన లక్పతి నాయక్

**ఆమనగల్లు, ఫిబ్రవరి 26 (అక్షర గళం):**

కడ్తాల్ మండలం గానుగు మర్ల తండా గ్రామ పంచాయతీ పరిధిలోని పోచమ్మ గడ్డ తండాకు చెందిన జర్పుల సేవ్య నాయక్ గురువారం అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న సేవలాల్ యువసేన రాష్ట్ర కార్యదర్శి, గానుగు మర్ల తండా ఉపసర్పంచ్ లక్పతి నాయక్ మృతుడి పార్థివ దేహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపి మనోధైర్యం కల్పించారు. ఆయన వంతు సహాయంగా 5 వేల రూపాయలు ఆర్థిక సహాయం అందజేశారు. ఆయన వెంట డీసీసీ అధికార ప్రతినిధి భిక్య నాయక్, టిక్ లాల్ నాయక్, రాజు నాయక్, భిక్య, కోట్య, పాండు, నగేష్, లక్ష్మణ్, నీరా తదితరులు ఉన్నారు.





# మున్సిపల్ చైర్మన్ వైస్ చైర్మన్ లను సన్మానించిన ఉప్పర సంఘం నాయకులు

**కల్వకుర్తి ఫిబ్రవరి 26 (అక్షర గలం):**

కల్వ కుర్తి మున్సిపాలిటీ వైస్ చైర్మన్ శాన్వాజ్ ఖాన్ ను ఆయన స్వగృహంలో గురువారం ఉప్పర సంఘం నాయకులు వేముల వెంకటేశాగర్ శ్రీగురుయాదయ్యసాగర్ఘనంగాసన్మా నించారు.





# మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ గా ఫైజాన్ అహ్మద్

**అక్షర గళం, మేడ్చల్ ప్రతినిధి :**

మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) గా ఫైజాన్ అహ్మద్ ను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణరావు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు గురువారం అదనపు కలెక్టర్ ఛాంబర్లో ఆయన బాధ్యతలు స్వీకరించారు. అంతకు ముందు జిల్లా కలెక్టర్ మన చౌదరిని మర్యాద పూర్వకంగా కలిసి పూల మొక్కను అందించారు. నిర్మల్ జిల్లా అదనపు కలెక్టర్ గా విధులు నిర్వహించిన ఫైజాన్ అహ్మద్ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కు బదిలీ పై వచ్చారు.

# ఘనంగా గోదావరి పుష్కరాల నిర్వహణ

**అమరావతి:** 2027 జూన్ 26వ తేదీ నుంచి జులై 7వ తేదీ వరకు జరిగే గోదావరి పుష్కరాలను 6 జిల్లాలో ఘనంగా నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఏపీ దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి అధ్యక్షతన 2027 గోదావరి పుష్కరాలపై క్యాబినెట్ సబ్ కమిటీ గురువారం సచివాలయంలో భేటీ అయింది. ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై మంత్రులు చర్చించారు. ఈ సమావేశానికి మంత్రులు కందుల దుర్గేశ్, బీసీ జనార్దన్ రెడ్డి, సత్యకుమార్ యాదవ్, గొట్టిపాటి రవి కుమార్, మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, ఉన్నతాధికారులు హాజరయ్యారు. ఐదు అంశాలపై ఈ భేటీలో సుదీర్ఘంగా చర్చించారు. గత భేటీలోని అంశాలు, గోదావరి పుష్కరాల ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్లు, ఆయా శాఖలు రూపొందించిన పీపీటీలు, మంత్రుల సలహాలు, సూచనలు తదితర అంశాలపై చర్చించింది. మహా కుంభమేలా తరహాలో గోదావరి పుష్కరాలు నిర్వహించాలని క్యాబినెట్ సబ్ కమిటీ భావించింది. 8 నుంచి 10 కోట్ల మంది ఈ పుష్కరాలకు వస్తారని క్యాబినెట్ సబ్ కమిటీ అంచనా వేస్తోంది. 4516 మీటర్ల మేర 373 ఘాట్లు ఏర్పాటు చేయాలని ప్రతిపాదనలకు అంచనా వేసింది. గతంలో ఉన్న 234 ఘాట్ల సంఖ్య పెంపునకు చర్యలు చేపట్టింది. పుష్కరాల ప్రధాన రోజుల్లో దాదాపు కోటి మంది వస్తారని అంచనా వేసింది. పవిత్ర స్నానానికి 2.25 కోట్ల మంది వస్తారని అంచనా వేసింది. భక్తుల సౌకర్యార్థం పిండ ప్రదానం ఘాట్లు, శానిటేషన్ ప్రక్రియ, రోడ్లు, వాటర్ తదితర విషయాల్లో పక్కా ప్రణాళిక ఉండాలని క్యాబినెట్ సబ్ కమిటీ నిర్ణయం తీసుకుంది. సాధారణ ధరలకే టెంట్ సిటీలు, హోమ్ స్టేలు ఏర్పాటుకు నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు పర్యాటక మంత్రి కందుల దుర్గేశ్‌తో క్యాబినెట్ సభ కమిటీ చర్చించింది. ఈస్ట్ గోదావరిలో 102 ఘాట్లు, వెస్ట్ గోదావరి 40, కోనసీమ 175, ఏలూరు 36, కాకినాడ 5, పోలవరం జిల్లాలో 11 ఘాట్లు.. మొత్తంగా 369 ఘాట్లు ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకుంది. ఏపీలో మొదటి గోదావరి పుష్కర ఘాట్ పోలవరం జిల్లాలో గుండాల, చివరి ఘాట్ కోనసీమ జిల్లాలోని అంతర్వేది, బలుసుతిప్ప, కాకినాడలో గోవలంక ఘాట్, వెస్ట్ గోదావరిలో నర్సాపురం ఘాట్ అని కమిటీ వెల్లడించింది. భక్తుల భద్రతకు పెద్దపీట వేయాలని నిర్ణయం తీసుకుంది. శాఖల మధ్య సమన్వయం కోసం ప్రత్యేకంగా నోడల్ ఆఫీసర్లను నియమించాలని క్యాబినెట్ సబ్ కమిటీ నిర్ణయించింది.

# గాలేరు-నగరిపై మండలిలో వాదోపవాదాలు

### రాయసలీమ ఎత్తిపోతల ఎప్పటికి పూర్తి చేస్తారన్న బొత్స

### వినే ఓపిక ఉండాలని మంత్రి నిమ్మల ఎదురుదాడి

**అమరావతి:** గాలేరు-నగరిపై చర్చలో అధికార, ప్రతిపక్షం మధ్య వాదోపవాదాలు చోటుచేసుకున్నాయి. గాలేరు నగరి ప్రాజెక్టుపై వైసీపీ సభ్యులు ప్రశ్న లేవనెత్తారు. వరద నీరు కేవలం 30 రోజులు మాత్రమే వస్తుందని.. జగన్ ప్రభుత్వం 3,825 కోట్ల రూపాయలతో రాయలసీమ ఎత్తిపోతల పథకాన్ని తీసుకొచ్చిందన్నారు. గాలేరు నగరి ప్రాజెక్టుకు ఎంత బడ్జెట్ కేటాయించారని.. ఎప్పటిలోగా పూర్తి చేస్తారని ప్రశ్నించారు. మూడోసారి వాయిదా అనంతరం ఏపీ శాసనమండలి తిరిగి మొదలైంది. రాయలసీయ నీటి ప్రాజెక్టులపైనే మండలిలో మరోసారి రచ్చ జరిగింది. గాలేరు నగరి ప్రాజెక్టు, రాయలసీమ ఎత్తిపోతల పథకం విషయాలపై వైసీపీ సభ్యులు ప్రశ్నలు సంధించగా మంత్రులు సమాధానాలు ఇచ్చారు. మంత్రి నిమ్మల రామానాయుడు సమాధానం ఇస్తూ.. రాయలసీమ ఎత్తిపోతల పథకానికి ఇతర ఎత్తిపోతల పథకాలకు ఉన్న తేడా తెలుసుకుని ప్రశ్నలు అడగాలని సూచించారు. ధైర్యంగా వాకౌట్ చేయకుండా సమాధానాలు వినాలన్నారు. రాయలసీమ ఎత్తిపోతల పథకంపై మరోసారి వివరాలు చెబుతానని మంత్రి తెలిపారు. సందర్భంగా బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ.. రాయలసీమ ఎత్తిపోతల పథకం అందరికీ అవసరమన్నారు. తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యలు వాస్తవమా? కాదా? అని ప్రశ్నించారు. ఈ పథకాన్ని ఎప్పటిలోగా ప్రారంభించి, ఎప్పటిలోగా పూర్తి చేస్తారో స్పష్టంగా చెప్పాలని డిమాండ్ చేశారు. ఎన్ని ట్రిబ్యునల్ గొడవలు వచ్చినా ఆనాటి ప్రభుత్వం ముందుకు వెళ్లిందని బొత్స సత్యనారాయణ గుర్తు చేశారు. మంత్రి నిమ్మల రామానాయుడు మరోసారి స్పందిస్తూ.. తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడిన రోజే మాజీ మంత్రి హరీశ్ రావు కూడా మాట్లాడారని అన్నారు. 'జగన్‌తో మాట్లాడాం... అంతకుమించి ముందుకు వెళ్ళవద్దని జగన్‌కు చెప్పినట్లు బీఆర్ఎస్ నాయకులు చెప్పారు' అని తెలిపారు. తెలంగాణ రాజకీయ ప్రయోజనాల కోసం వారు మాట్లాడారని మంత్రి చెప్పారు. మంత్రి పయ్యావుల కేశవ్ మాట్లాడుతూ.. రాయలసీమ లిఫ్ట్ విషయంలో తప్పంతా వైసీపీదే అని ఆరోపించారు. ప్రాజెక్టును ఆపి తప్పు చేసింది ఎవరో వైసీపీ నేతలు తెలుసుకోవాలన్నారు. సభా సాక్షిగా రాయలసీమకు జగన్ సర్కారు ఏమీ చేయలేదని వైసీపీ సభ్యులు నిరూపించారని చెప్పారు. 'జగన్‌తో మాట్లాడి రాయలసీమ లిఫ్ట్‌పై తామే స్టే తెచ్చామని ఆనాటి ఇరిగేషన్ మంత్రిగా ఉన్న హరీశ్ రావు స్పష్టంగా చెప్పారు. ఈ విషయాన్ని తెలంగాణ శాసనసభ వేదికగా హరీశ్ రావు తెలిపారు' అని మంత్రి గుర్తుచేశారు. చేతకాని వైసీపీ దద్దమ్మ ప్రభుత్వం రాష్ట్ర ప్రయోజనాలను తాకట్టు పెట్టిందని విమర్శించారు. ప్రాజెక్టు ఆపితే... చేతకాకుండా కోర్టుకు వెళ్లి అఫిడవిట్ వేస్తే దానికి తాము సమాధానం చెప్పాలా అంటూ మంత్రి పయ్యావుల కేశవ్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

# తిరుమల లడ్డూపై మండలిలో స్వల్పకాలిక చర్చ

### పరస్పర విమర్శలతో సభలో గందరగోళం

### చర్చకు ముందే ప్రకటన చేస్తామన్న మంత్రి కేశవ్

### చర్చకు ముందు కుదరదన్న ఛైర్మన్

### గందరగోళం మధ్యే సభ నేటికి వాయిదా

**అమరావతి:**ఏపీ శాసనమండలిలో తిరుమల లడ్డూ అంశంపై స్వల్పకాలిక చర్చలో వాదోపవాదాల మధ్య చర్చ ప్రారంభం అయ్యింది. అయితే పరస్పర విమర్శలతో సభను ఛైర్మన్ కొయ్యే మోషేన్ రాజు శుక్రవారానికి వాయిదా వేశారు. చర్చ సందర్భంగా అధికార, విపక్ష సభ్యుల ఆందోళనలతో గందరగోళం ఏర్పడటంతో సమావేశాలను ఛైర్మన్ శుక్రవారం వాయిదా వేశారు. స్వల్పకాలిక చర్చలో భాగంగా తొలుత వైసీపీ సభ్యుడు పర్వతనేని చంద్రశేఖర్ రెడ్డికి మాట్లాడేందుకు అవకాశం ఇచ్చారు ఛైర్మన్. చర్చ సాగుతుండగా ప్రభుత్వం తరఫున స్టేట్‌మెంట్ ఇచ్చేందుకు తనకు అవకాశం కల్పించాలని మంత్రి పయ్యావుల కేశవ్ అన్నారు. స్వల్పకాలిక చర్చలో స్టేట్‌మెంట్ చేసే అవకాశం మంత్రికి ఉండదని.. రిప్లై మాత్రమే ఉంటుందని మండలి ఛైర్మన్ స్పష్టం చేశారు. స్టేట్‌మెంట్ కాపీలు సిద్ధం చేయాలని మండలి ఛైర్మన్ లేఖ రాశారని పయ్యావుల కేశవ్ పేర్కొన్నారు. తన అనుమతి లేకుండా ఆ లేఖ సిద్ధం చేశారని ఛైర్మన్ తెలిపారు. ఈ క్రమంలో కల్తీ నెయ్యి అంశంపై శాసనమండలిలో గందరగోళం నెలకొంది. చర్చకు ప్రతిపక్షానికి ముందుగా అవకాశం ఇస్తామని మండలి ఛైర్మన్ మోషేను రాజు అన్నారు. దీంతో ప్రభుత్వం నుంచి స్టేట్‌మెంట్ వద్దంటారా అంటూ మంత్రి పయ్యావుల కేశవ్ అభ్యంతరం వ్యక్తం చేశారు. 'స్టేట్‌మెంట్ ఇస్తామని మేము ముందే చెప్పాం. లఘు చర్చకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది. ఎంత సమయమైనా చర్చకు అనుమతించండి. అర్ధరాత్రి వరకు చర్చ కొనసాగించినా మాకు ఇబ్బంది లేదు. వినేందుకు కూడా ఓపిక లేనప్పుడు ప్రశ్నలు ఎందుకు అడగాలి. చర్చకు వైకాపా సభ్యులు ఎందుకు భయపడుతున్నారు' అని ప్రశ్నించారు. తిరుమల లడ్డూపై చర్చించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని, ముందుగా ప్రభుత్వం నుంచి స్టేట్‌మెంట్‌కు అవకాశం కల్పించాలన్నారు మంత్రి. చర్చకు ప్రభుత్వం భయపడుతోందని విపక్ష నేత బొత్స సత్యనారాయణ ఆరోపించారు. దేవదేవుడి ప్రసాదాన్ని రాజకీయాలకు వాడుకుంటున్నారని ఆయన విమర్శించారు. తిరుమల లడ్డూపై సభలో చర్చ చేపట్టాలని వైసీపీ సభ్యులు ఆందోళనకు దిగారు. అధికార, విపక్ష సభ్యుల మధ్య తీవ్ర వాగ్వాదం, గందరగోళం ఏర్పడింది. ఈ నేపథ్యంలో శాసనమండలి సమావేశాలను రేపటికి వాయిదా వేస్తున్నట్లు మండలి ఛైర్మన్ మోషేన్ రాజు ప్రకటించారు.

# విహెచ్, జెట్టిలకు రాజ్యసభ ఇవ్వాలి

### ఆ ఇద్దరి సభ్యత్వాలపై ఆలోచన చేయాలని

### ఖర్గేను కలిసి కోరిన కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి

**న్యూఢిల్లీ:** తెలంగాణలో ఖాళీ అవుతున్న రెండు రాజ్యసభ స్థానాల్లో కాంగ్రెస్ సీనియర్ నేత వి. హనుమంతరావు, జెట్టి కుసుమ కుమార్‌లకి ఇవ్వాలని కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి అన్నారు. ఈ మేరకు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి గురువారం ఢిల్లీలో కలిశారు. ఖర్గేతో ఆయన పలు కీలక అంశాలపై చర్చించారు. తెలంగాణలో ఖాళీ కానున్న రెండు రాజ్యసభ స్థానాలపై సీఎం రేవంత్‌రెడ్డి, టీపీసీసీ ప్రెసిడెంట్ మహేశ్ కుమార్ గౌడ్, ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్‌తో కూడా ఈ విషయంపై మాట్లాడానని, వి. హనుమంతరావు, జెట్టి కుసుమ కుమార్‌లకి రాజ్యసభ ఇవ్వాలని కోరానని అన్నారు. ఇదే విషయంపై రాహుల్ గాంధీని, మల్లికార్జున్ ఖర్గేని కలవడానికి ఢిల్లీకి వచ్చానని తెలిపారు. రాహుల్ గాంధీ ముందస్తు షెడ్యూల్ కారణంగా ఆయన బిజీగా ఉన్నారని చెప్పుకొచ్చారు. వి. హనుమంతరావు. జెట్టి కుసుమ కుమార్‌లకు రాజ్యసభ అవకాశాలపై ఆలోచన చేయాలని కోరానని తెలిపారు. జెట్టి కుసుమ కుమార్.. యూత్ కాంగ్రెస్ లీడర్‌గా, స్టూడెంట్ లీడర్‌గా.. కమ్మ సామాజిక వర్గం నుంచి ఉన్నారని ప్రస్తావించారు. జెట్టి కుసుమ కుమార్ ఫ్యామిలీ ఫ్రీడమ్ ఫైటర్స్ అని, వాళ్ల కుటుంబం నుంచి అంతా కాంగ్రెస్‌లోనే ఉన్నారని గుర్తుచేశారు. హనుమంతరావు తెలంగాణలో అనేక మంది ముఖ్యమంత్రులతో పని చేశారని వెల్లడించారు. మూడుసార్లు రాజ్యసభ ఎంపీగా పని చేశారని చెప్పుకొచ్చారు. ఆయనకు రాజీవ్ గాంధీ , సోనియాగాంధీ అవకాశాలు ఇచ్చారని తెలిపారు. వి.హనుమంతరావు చురుకైన వ్యక్తి అని, ఆయనకు మరోసారి రాజ్యసభకు అవకాశం ఇవ్వాలని ఖర్గేను కోరానని అన్నారు. కమిటీలో చర్చిస్తామని ఖర్గే హామీ ఇచ్చారని తెలిపారు. రాహుల్ గాంధీ నిర్ణయం మేరకు ముందుకు వెళ్తామని జగ్గారెడ్డి పేర్కొన్నారు.

# ది కేరళ స్టోరీ విడుదలకు బ్రేక్

### సెన్సార్ బోర్డును తప్పుపట్టిన హైకోర్టు

**తిరువనంతపురం:** సరిగ్గా విడుదలకు ఒక్కరోజు ముందు 'ది కేరళ స్టోరీ2' మూవీకి న్యాయపరంగా ఎదురుదెబ్బ తగిలింది. సినిమా ప్రచార చిత్రంలో కేరళను తప్పుగా చూపించారని, మతపరమైన ఉద్రిక్తతలకు దారితీసే అంశాలు ఉన్నాయని సామాజిక మాధ్యమాల వేదికగా చర్చనీయాంశమైన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో సినిమా విడుదలపై స్టే విధించాలని, సెన్సార్ సర్టిఫికేషన్ రద్దు చేయాలని కోరుతూ దాఖలైన పిటిషన్లపై గురువారం రాష్ట్ర హైకోర్టులో విచారణ జరిగింది. ఈ సందర్భంగా సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ (సీబీఎఫ్‌సీ) తీరును హైకోర్టు తప్పుపట్టింది. సినిమా పునః పరిశీలించాల్సిందిగా జస్టిస్ కురియన్ థామస్ సీబీఎఫ్‌సీకి సూచించారు. అప్పటివరకూ సినిమా విడుదలపై స్టే విధిస్తున్నట్లు ఉత్తర్వులు జారీ చేశారు. 2023లో వివాదాల నడుమ విడుదలైన 'ది కేరళ స్టోరీ'కి సీక్వెల్‌గా ఈ సినిమా రూపొందింది. దీనికి కామాఖ్యా నారాయణ్ సింగ్ దర్శకత్వం వహించగా విపుల్ అమృత్‌లాల్ షా నిర్మించారు. ఉల్కా గుప్తా, అదితి భాటియా, ఐశ్వర్య ఓజా నటించారు. ప్రేమ మాయలో పడి కొందరు అమ్మాయిలు.. కన్నవాళ్లను ఎదురించి తమ ప్రియుడితోనే జీవితం అనుకుని దూరమవుతుంటారు. కానీ రోజులు గడుస్తున్నకొద్దీ ఆ ప్రేమే ఓ పెద్ద మోసమని తెలుసుకున్నాక దిక్కుతోచని పరిస్థితుల మధ్య ఎవరికీ చెప్పుకోలేని హింసని భరిస్తుంటారు. అలాంటి నిజజీవిత కథాంశంతో 'ది కేరళ స్టోరీ 2: గోస్ బియాండ్' రూపొందింది.

## ఇంటర్ పరీక్షల్లో మాల్ ప్రాక్టీస్

**హైదరాబాద్:** రాష్ట్రంలో బుధవారం నుంచి ఇంటర్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. పరీక్షల రెండో రోజు గురువారం ఇంటర్ ద్వితీయ సంవత్సరం సెకండ్ లాంగ్వేజ్ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని ఇంటర్‌మీడియట్ బోర్డు సెక్రటరీ తెలిపారు. మొత్తం 4,63,354 మంది విద్యార్థులకు గాను 4,52,980 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారని వివరించారు. 10,374 మంది గైర్హాజరయ్యారని వెల్లడించారు.

## కలెక్టర్ బదిలీలో పండగ చేసుకున్న జనం

**మహబూబాబాద్:** జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్‌ను ప్రభుత్వం బదిలీ చేయడంతో మానుకోట జిల్లాలో పండగ వాతావరణం నెలకొంది. గత కొంతకాలంగా కలెక్టర్ పనితీరుపై తీవ్ర అసంతృప్తితో ఉన్న గిరిజన ప్రజా సంఘాలు, ఈ బదిలీ వార్త తెలియగానే రోడ్లపైకి వచ్చి సంబరాలు చేసుకున్నాయి. బాణసంచా కాల్చి, ఒకరికొకరు స్వీట్లు పంచుకుంటూ తమ సంతోషాన్ని వ్యక్తపరిచారు. గత రెండు సంవత్సరాలుగా కలెక్టర్‌గా పనిచేసిన అద్వైత్ కుమార్, జిల్లా అభివృద్ధిని పూర్తిగా విస్మరించారని గిరిజన నాయకులు ఆరోపించారు. ఒక గిరిజన జిల్లాగా ఉన్న మహబూబాబాద్‌ను ఆయన తన నిర్ణయాలతో పదేళ్ల పాటు వెనక్కి నెట్టేశారని వారు విమర్శించారు. రైతుల భూ సమస్యలు, పట్టాదారు పాసుపుస్తకాల జాప్యం వంటి కీలక అంశాలను ఆయన గాలికి వదిలేశారని మండిపడ్డారు. జిల్లా కలెక్టర్‌కు వచ్చే ప్రత్యేక నిధులను పేద వర్గాల ప్రజల సంక్షేమం కోసం లేదా అభివృద్ధి పనుల కోసం వినియోగించలేదని బాధితులు పేర్కొన్నారు. ప్రజలకు మేలు చేయాల్సిన నిధులను తిరిగి ప్రభుత్వానికి పంపించేశారని, ఇది జిల్లా ప్రజలకు చేసిన ద్రోహమని వారు ఆవేదన వ్యక్తం చేశారు. విద్యా , వైద్య రంగాల్లో నెలకొన్న కనీస సమస్యలను కూడా ఆయన పరిష్కరించలేకపోయారని ధ్వజమెత్తారు. ప్రజల సమస్యల పరిష్కారం కోసం మంత్రులు ఇచ్చిన ఆదేశాలను కూడా కలెక్టర్ లెక్కచేయలేదని, దీనివల్ల సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారని గిరిజన సంఘాలు ఆరోపించాయి. ఈ నేపథ్యంలో ఆయనను బదిలీ చేస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం పట్ల గిరిజన జిల్లా ప్రజలందరూ హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా సమస్యలను అర్థం చేసుకునే కొత్త కలెక్టర్ రావాలని వారు కోరుకుంటున్నారు.

## మూడుముళ్ల బంధంతో ఒక్కటైన విరోష్

**ఉదయ్‌పూర్:** విజయ్ దేవరకొండ, రష్మిక మూడు ముళ్ల బంధంతో ఒక్కటయ్యారు. గురువారం ఉదయం 10.10కి రష్మిక మెడలో విజయ్ మూడు ముళ్లు వేశారు. ఈ వేడుకకు సంబంధించిన ఫొటోలను రష్మిక అభిమానులతో పంచుకుంటూ 'హాయ్ మై లవ్స్.. నా భర్తను మీకు పరిచయం చేస్తున్నా మిస్టర్ విజయ్ దేవరకొండ ' అని పేర్కొన్నారు. ఇకపోతే పరిమిత సంఖ్యలోనే పెళ్లి వేడుకకు అతిథులు హాజరయ్యారు. ఇరు కుటుంబ సభ్యుల మధ్య వేడుక జరిగిందని సమాచారం. 4న హైదరాబాద్‌లో రిసిప్షన్ ఏర్పాటు చేశారు.

## అసైన్డ్ భూముల చట్టసవరణకు అసెంబ్లీ ఆమోదం

**అమరావతి:** ఏపీ శాసనసభ బడ్జెట్ సమావేశాల్లో అసైన్డ్ భూముల చట్ట సవరణ బిల్లును రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ ప్రవేశపెట్టారు. ఈ బిల్లుకు సభ ఆమోదం తెలిపింది. ఈ సందర్భంగా మంత్రి అనగాని మాట్లాడుతూ.. అసైన్డ్ భూములను సౌర విద్యుత్ సంస్థలకు లీజుకు ఇచ్చేలా చట్టసవరణ చేశామని.. హరిత ఇంధన సంస్థలకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందన్నారు. కర్బన ఉద్గారాలు సున్నాకు తీసుకురావటమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. రాష్ట్రంలో 10వేల మెగావాట్ల సౌర విద్యుత్ ప్రాజెక్టులు ఏర్పాటవుతున్నాయని తెలిపారు. ఈ ప్రాజెక్టుల ద్వారా 7 లక్షల 50 వేల మందికి ఉద్యోగ అవకాశాలు కలుగుతాయని అంచనా వేస్తున్నామన్నారు. గతంలో ఇలాంటి ప్రాజెక్టులకు అసైన్డ్ భూములు తీసుకోవడం సాధ్యమయ్యేది కాదని, చట్ట సవరణ ద్వారా అసైన్డ్ భూములు లీజుకు ఇచ్చే వెసులుబాటు కలుగుతోందని మంత్రి తెలిపారు. తద్వారా అసైన్డ్ భూముల యజమానులకు రూపంలో ఆదాయం వస్తుందన్నారు. రెండేళ్లకు ఒకసారి లీజు మొత్తాన్ని పెంచేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఇప్పటి వరకు వివిధ ప్రభుత్వాలు కలిపి 35 లక్షల ఎకరాల భూములను అసైన్డ్ చేశాయని మంత్రి అనగాని సత్యప్రసాద్ పేర్కొన్నారు. సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి మాట్లాడుతూ.. అసైన్డ్ భూములు చాలా చోట్ల చేతులు మారాయని.. పేదల నుంచి భూములు తీసుకున్నవారు లబ్ది పొందుతున్నారని తెలిపారు. అసలు లబ్దిదారులకే లీజు డబ్బు అందేలా చూడాలని సూచించారు. కొన్ని చోట్ల అసైన్డ్ భూముల్లో పండ్ల తోటలు సాగు చేస్తున్నారని, అలాంటి రైతులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. వైసీపీ హయాంలో భూముల ఫ్రీ-హోల్డ్‌లో కుంభకోణం జరిగిందని, దీనిపై ప్రభుత్వం సమగ్ర విచారణ చేపట్టాలని ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి అన్నారు.

## కల్తీపాల బాధితులకు మంత్రి దుర్గేశ్ పరామర్శ

**రాజమహేంద్రవరం:** రాజమహేంద్రవరంలో కల్తీ పాల ఘటనపై ఏపీ ప్రభుత్వం వేగంగా స్పందించింది. బాధితులను కాపాడేందుకు 'ఫోబి ఫిజల్' అనే ప్రత్యేక ఔషధాన్ని అత్యవసరంగా తెప్పించింది. ఈ ఘటనలో తీవ్ర అస్వస్థతకు గురై కిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను మంత్రి కందుల దుర్గేష్ నేడు పరామర్శించారు. బాధితుల కుటుంబసభ్యులతో మాట్లాడి, వారికి అందుతున్న వైద్య సేవలను స్వయంగా పర్యవేక్షించారు. పరామర్శ అనంతరం మంత్రి దుర్గేష్ మీడియాతో మాట్లాడుతూ వివరాలను వెల్లడించారు. ప్రస్తుతం కిమ్స్ ఆసుపత్రిలో 8మంది బాధితులు చికిత్స పొందుతున్నారని, వీరిలో నలుగురు బాధితులు ప్రస్తుతం వెంటిలేటర్‌పై ఉన్నారని తెలిపారు. వారి పరిస్థితి విషమంగా ఉందని మంత్రి వెల్లడించారు. బాధితులను కాపాడేందుకు 'ఫోబి ఫిజల్' అనే అత్యవసర మెడిసిన్‌ను ప్రభుత్వం ప్రత్యేకంగా తెప్పించిందని మంత్రి చెప్పారు. ప్రముఖ నెఫ్రాలజిస్ట్ డాక్టర్ రవిరాజు ఆధ్వర్యంలో ఈ ఇంజక్షన్లను బాధితులకు ఇస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

# నదుల అనుసంధానమే శ్రీరామరక్ష

**వంశధార నుంచి పెన్నా వరకూ నదులను అనుసంధానించాలి**

**పోలవరం - నల్లమల సాగర్ లింకు ప్రాజెక్టుతో మేలు**

**కాళేశ్వరం కట్టినా మేం అభ్యంతరం చెప్పలేదు**

**గోదవరిలో వృధా జలాలు వినియోగంలోకి తెస్తాం**

**నదుల అనుసంధానంతో తెలుగుతల్లికి జలహారతి పడతా**

**తాగు,సాగునీటి సరఫరా లక్ష్యంగా ప్రాజెక్టుల నిర్మాణం**

**సాగునీటి రంగంపై శాసనసభలో సీఎం చంద్రబాబు**

**అమరావతి:** పోలవరం - నల్లమల సాగర్ లింకు ప్రాజెక్టు వల్ల ఎవరికీ నష్టం లేదని ఏపీ సీఎం నారా చంద్రబాబు నాయుడు మరోమారు స్పష్టం చేశారు. గోదావరి నుంచి సముద్రంలోకి వెళ్లే వృథాగా వరద జలాలను.. ఆయా ప్రాజెక్ట్‌లకు తరలిస్తామని పేర్కొన్నారు. గోదావరిపై ఎగువన తెలంగాణ రాష్ట్రం కాళేశ్వరం ప్రాజెక్టు కట్టిందని, దీనికి తాము అభ్యంతరం చెప్పలేదని ప్రస్తావించారు. రెండు తెలుగు రాష్ట్రాలకూ దీని వల్ల లాభం కలుగుతుందని ఉద్ఘాటించారు. పోలవరం - నల్లమల సాగర్ లింకు ప్రాజెక్టుకి పొరుగు రాష్ట్రం అభ్యంతరం చెప్పాల్సిన అవసరం లేదని చెప్పుకొచ్చారు. ప్రకృతిని ఆరాధించడం.. నీటిని పూజించే సంప్రదాయం మనదని సీఎం చంద్రబాబు అన్నారు. గోదావరికి అఖండ హారతి ఇచ్చామని, కృష్ణకు పవిత్ర హారతి ఇచ్చామని గుర్తు చేస్తూ.. నదులను పూజించడం సంప్రదాయంగా పెట్టుకున్నామని తెలిపారు. సాగునీటి రంగంపై సీఎం చంద్రబాబు శాసనసభలో మాట్లాడారు. గంగా- కావేరి అనుసంధానం కావాలనేది నా ప్రగాఢ ఆకాంక్ష అని చెప్పారు. ఏ పనైనా చిన్న ఆలోచనతోనే మొదలవుతుంది. గంగా-కావేరి అనుసంధానం సాధ్యాసాధ్యాలపై ఆనాడే చర్చలు జరిగాయి. నదుల అనుసంధానం చేసి తెలుగుతల్లికి జలహారతి ఇచ్చే బాధ్యత మాది. నదుల అనుసంధానం వల్ల నీటి సమస్యలు తగ్గుతాయి. రాష్ట్రంలో కట్టిన ప్రాజెక్టులన్నీ ఎన్డీయే లేదా తెదేపా హయాంలోనే జరిగాయి. పట్టిసీమ నుంచి 100 టీఎంసీలు కృష్ణాకు తీసుకొచ్చాం. వెలిగొండ ప్రాజెక్టుకు నేనే శంకుస్థాపన చేశా... నేనే పూర్తి చేస్తున్నా. ధవళేశ్వరం వద్ద బ్యారేజీ నిర్మాణం వల్ల కాటన్ దొరను ఇప్పటికీ గుర్తుపెట్టుకుంటున్నారు. గోదావరి జిల్లాల్లో కాటన్ దొర విగ్రహాలు పెట్టి పూజిస్తున్నారని చంద్రబాబు అన్నారు. 2047 విజన్‌లో భాగంగా కూటమి ప్రభుత్వం ప్రధానంగా నీటి భద్రతపైనే దృష్టి సారించిందని సీఎం వ్యాఖ్యానించారు. గోదావరి, కృష్ణా పుష్కరాలను కూడా ఘనంగా నిర్వహించే బాధ్యత తమ ప్రభుత్వానికే దక్కిందని తెలిపారు. గోదావరికి అఖండ హారతి, కృష్ణా నదికి పవిత్ర హారతి ఇవ్వడం ద్వారా జలాలను అత్యంత విలువైన వనరుగా భావిస్తున్నామని పేర్కొన్నారు. గోదావరి నది నుంచి సగటున ఏడాదికి 3 వేల టీఎంసీల నీళ్లు సముద్రంలోకి వృథాగా పోతున్నాయని వివరించారు. వంశధార నుంచి పెన్నా వరకూ రాష్ట్రంలో నదులను అనుసంధానిస్తే సమస్యలు పరిష్కారమవుతాయని సీఎం చంద్రబాబు వెల్లడించారు. గంగా-కావేరీ అనుసంధానం జరగాలన్నది తన ప్రగాఢమైన ఆకాంక్ష అని చెప్పుకొచ్చారు. గంగా - కావేరి అనుసంధానం సాధ్యా సాధ్యాలపై ఆనాడే చర్చలు జరిగాయని ప్రస్తావించారు. నదులు అనుసంధానం చేసి, తెలుగు తల్లికి జలహారతి ఇచ్చేలా ప్రణాళికలు చేస్తున్నామని తెలిపారు. హంద్రీనీవా ద్వారా 738 కిలోమీటర్ల మేర కాలువలను విస్తరించి కుప్పంలో పరమ సముద్రం చెరువు వరకూ నీరిచ్చామని వివరించారు. మడకశిర వరకూ నీళ్లు తీసుకెళ్లి ఆ ప్రాంత దాహార్తిని తీర్చామన్నారు. ఎన్టీఆర్ హయాంలోనే రాయలసీమకు తెలుగు గంగ, గాలేరు నగరి, హంద్రీనీవా లాంటి ప్రాజెక్టులు చేపట్టినట్లు ప్రస్తావించారు. సాగునీటిపై 2014 నుంచి 2019లో రూ.68 వేల కోట్లు ఖర్చు చేశామని పేర్కొన్నారు. గడిచిన 20 నెలలుగా రూ.20 వేల కోట్ల వరకూ ఖర్చు చేయగలిగామని వివరించారు. పట్టిసీమ ద్వారా కృష్ణా డెల్టాకూ నీరిచ్చి, శ్రీశైలంలో నీటిని పొదుపు చేసి 100 టీఎంసీలను రాయలసీమకు తరలించామని వెల్లడించారు. అందుకే ఆ ప్రాంతం రతనాల సీమగా మారిందన్నారు. వెలిగొండ ప్రాజెక్టు పూర్తి చేసి మార్కాపురంతో సహా వివిధ ప్రాంతాలకు న్యాయం చేస్తామని సీఎం చంద్రబాబు భరోసా కల్పించారు. ఆర్థిక ఇబ్బందులున్నా కూడా మార్కాపురం, ఒంగోలు జిల్లాలను సస్యశ్యామలం చేస్తామని సీఎం చంద్రబాబు మాటిచ్చారు. 30 ఏళ్ల ముందు ఆ ప్రాజెక్టు శంకుస్థాపన చేసి.. మొదటి దశను ఈ ఏడాది జూలైలోనే పూర్తి చేసి నీళ్లు ఇస్తామని చెప్పుకొచ్చారు. వెలిగొండ ప్రాజెక్టుకు రూ.2500 కోట్ల మేర ఇంకా ఖర్చు చేయాల్సి ఉందని వివరించారు. రూ.456 కోట్లతో ఫీడర్ కాలువ లైనింగ్ పనులకు శంకుస్థాపన చేశామని అన్నారు. ఈ క్రెడిట్ మొత్తం వైసీపీనే చోరీ చేస్తోందని ఆగ్రహించారు. వెలిగొండకు నీళ్లు రాకుండానే జగన్ రెడ్డి రిబ్బన్ కట్ చేశారని ఎద్దేవా చేశారు. కుప్పం లోనూ ట్యాంకర్లు తీసుకువచ్చి కాలువలో పోశారని విమర్శించారు. జగన్ హయాంలోని ఐదేళ్లలో ఉత్తరాంధ్ర ప్రాజెక్టులని నిర్లక్ష్యం చేశారని ధ్వజమెత్తారు. రూ.2 వేల కోట్లతో ఉత్తరాంధ్ర ప్రాజెక్టులన్నీ దశలవారీగా పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. పోలవరం ప్రాజెక్టును విధ్వంసం చేశారని ఫైర్ అయ్యారు. డయాఫ్రాం వాల్‌ను గోదాట్లో కలిపేశారని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వంలో మళ్లీ ఆ ప్రాజెక్టును పరుగులు పెట్టిస్తున్నామని చెప్పుకొచ్చారు. పుష్కరాలకంటే ముందు ఆ ప్రాజెక్టు పూర్తి చేసి జాతికి అంకితం చేస్తామని మాటిచ్చారు. చింతలపూడి ఎత్తిపోతలను పూర్తి చేసి ఏలూరు, కృష్ణా జిల్లాలకు నీరు అందించేలా చర్యలు చేపడతామని పేర్కొన్నారు. 1312 టీఎంసీల నీటిని ఏపీ ప్రాజెక్టుల్లో నిల్వ చేసుకునే అవకాశం ఉందని సీఎం చంద్రబాబు వ్యాఖ్యానించారు. 'ప్రస్తుతం 793 టీఎంసీల నీటితో రాష్ట్రంలోని అన్ని రిజర్వాయర్లూ కళకళలాడుతున్నాయి. మే 15 తేదీన నారుమళ్లకు నీరిచ్చేలా చర్యలు తీసుకుంటున్నాం. 16 లక్షల హెక్టార్లలో మైక్రో ఇరిగేషన్ సాగుతో దేశంలోనే అగ్రస్థానంలో ఏపీ ఉంది. నీటి నిర్వహణ నుంచి పొదుపు చేసే వరకూ నీటి వినియోగదారుల సంఘాలకు అప్పగిస్తున్నాం. ఏపీ వ్యాప్తంగా భూగర్భ జలాల పెంపునకు పటిష్టమైన చర్యలు చేపడుతున్నాం. ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా సగటున 7 మీటర్ల లోతులో భూగర్భజలాలు ఉన్నాయి. భూగర్భజలాలు గణనీయంగా పెరగటంతో కొన్ని ప్రాంతాల్లో విద్యుత్ మోటార్ల ద్వారా వినియోగం కూడా తగ్గింది. తద్వారా రూ.91 కోట్ల మేర విద్యుత్ కూడా ఆదా అయ్యింది. ఏపీలో 50 శాతం గ్రీన్ కవర్ పెరిగేలా చర్యలు తీసుకుంటున్నాం. ఒక్క తిరుమలలోనే 89 శాతం మేర పచ్చదనం ఉంది. గత పాలనలో గుండ్ల కమ్మ గేట్లు కొట్టుకుపోతే గేట్లు పెట్టేందుకు కూడా కాంట్రాక్టర్లు ముందుకు రాలేదు. వైసీపీ హయాంలో పోలవరం డయాఫ్రాం వాల్ కొట్టుకుపోతే.. దాన్ని కూడా గుర్తించలేదు. జగన్ హయాంలో చేయని తప్పునకు నన్ను 53 రోజుల పాటు జైల్లో పెట్టారు. రాష్ట్రంలోని ప్రతి ఎకరాకూ నీరు ఇవ్వాలనే లక్ష్యంతోనే పనిచేస్తున్నాను. కావేరిపై రెండు రాష్ట్రాలు ఎలా కొట్టుకున్నాయో చూశాం. నీరుంటే ఎలాంటి సమస్యలూ రావు. నీటి భద్రతను ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలి. కొందరు రాజకీయం కోసమే నీటి సమస్యల్ని తీసుకొస్తున్నారు. ఏపీకి ఉండే వాటర్ సెక్యూరిటీ దక్షిణ భారత్‌లో మరే రాష్ట్రానికీ లేదు. భూమినే జలాశయంగా మార్చి నీటి సంరక్షణ చేయాలని అందరికీ పిలుపునిస్తున్నాను. వ్యవసాయానికి, పరిశ్రమలకు నీరు ఇవ్వడంతో పాటూ ప్రతి ఇంటికీ తాగునీరు ఇస్తే లక్ష్యాన్ని సాధించినట్లే. తెలుగు తల్లికి జలహారతి ఇచ్చేలా ప్రతి ఎకరాకూ నీరిచ్చే ధృఢ సంకల్పంతో పనిచేస్తున్నాం. రాష్ట్రంలో ప్రాజెక్టులను పూర్తి చేసేందుకు బ్లూ ప్రింట్‌ను కూడా సిద్ధం చేస్తున్నాం' అని సీఎం నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. చేయని నేరానికి నన్ను గత పాలకులు.. 53 రోజులు పాటు జైల్లో పెట్టారు. రాష్ట్రంలో ప్రతి ఎకరాకూ నీరు ఇవ్వాలన్న లక్ష్యంతోనే పని చేస్తున్నా. కావేరిపై రెండు రాష్ట్రాలు ఎలా కొట్లాడుకుంటున్నాయో చూశాం. నీరు పుష్కలంగా ఉంటే ఎలాంటి సమస్యలు రావు. నీటి భద్రతను ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలి. కొందరు రాజకీయం కోసమే నీటి సమస్యలను తీసుకొస్తున్నారు. ఏపీకి ఉండే వాటర్‌సెక్యూరిటీ దక్షిణ భారత్‌లో మరే రాష్ట్రానికీ లేదు. భూమినే జలాశయంగా మార్చి నీటి సంరక్షణ చేయాలని అందరికీ పిలుపునిస్తున్నా. సాగునీరు, పరిశ్రమలకు నీరు, ప్రతి ఇంటికీ తాగునీరు ఇస్తే లక్ష్యం సాధించినట్లే. తెలుగుతల్లికి జలహారతి ఇచ్చేలా ప్రతి ఎకరాకు నీరివ్వాలని సంకల్పం. రాష్ట్రంలో ప్రాజెక్టుల పూర్తికి బ్లూప్రింట్ సిద్ధం చేస్తున్నాం అని చంద్రబాబు

## ఇజ్రాయెల్-భారత్ మధ్య స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం

**యూపీఐ పేమెంట్స్ విషయంలో ఇరు దేశాల మధ్య ఎవోయూ**

**ఏఐ, వ్యవసాయం తదితర రంగాల్లో ఒప్పందాలు**

**ఇజ్రాయిల్ పర్యటనలో ప్రధాని మోడీ ప్రకటన**

**న్యూఢిల్లీ:** ఇజ్రాయెల్-భారత్ మధ్య త్వరలోనే స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం కుదరనుందని ప్రధాని నరేంద్ర మోదీ వెల్లడించారు. అలాగే ఇజ్రాయెల్‌లో కూడా త్వరలో యూపీఐ సేవలను వినియోగించుకోవచ్చని తెలిపారు. ఈ మేరకు యూపీఐ పేమెంట్స్ విషయంలో ఇరు దేశాల మధ్య ఒప్పందం కుదిరింది. యూపీఐ పేమెంట్స్‌తో పాటు ఏఐ, వ్యవసాయం తదితర రంగాల్లో ఒప్పందాలు కుదిరాయి. రెండు దేశాల మధ్య త్వరలోనే స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం జరగనున్నట్టు ఇరు దేశాల ప్రధానులు సంయుక్త ప్రకటనలో వెల్లడించారు. మొత్తం 27 రంగాల్లో పరస్పర సహకారానికి ఇరు దేశాలు అంగీకరించాయి. మరోవైపు గాజాపై ప్రధాని మోదీ మరోసారి భారత్ వైఖరిని స్పష్టం చేశారు. మానవత్వం ఎప్పుడూ సంఘర్షణకు బలికాకూడదని అన్నారు. ప్రస్తుతం శాంతి ప్రణాళిక ద్వారా ఓ ముందడుగు పడిందని, ఈ ప్రయత్నాలకు భారత్ పూర్తి మద్దతుగా నిలుస్తుందని మోదీ హామీ ఇచ్చారు. ఇాగా, త్వరలోనే భారత పర్యటనకు రావాల్సిందిగా ఇజ్రాయెల్ ప్రధాని బెంజిమిన్ నెతన్యాహును ఆహ్వానించారు. అంతకు ముందు ఇజ్రాయెల్ పార్లమెంట్‌లో ప్రధాని మోదీ చేసిన ప్రసంగాన్ని నెతన్యాహు ప్రశంసించారు. ఆయన ప్రసంగం ప్రతి ఒక్కరినీ కదిలించిందని అన్నారు. భారత్‌కు రుణపడి ఉన్నామని అన్నారు. మోదీ తమకు స్నేహితుడు కంటే ఎక్కువని అభివర్ణించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఇజ్రాయెల్ పర్యటన రెండు దేశాల మధ్య సరికొత్త మైత్రికి నాంది పలికింది. విమానాశ్రయం నుంచి ఇజ్రాయెల్ పార్లమెంట్ వరకు మోడీకి లభించిన ఘన స్వాగతం ఈ పర్యటన ప్రాధాన్యతను చాటిచెప్పింది. పర్యటనలో భాగంగా నిర్వహించిన సంయుక్త విలేకరుల సమావేశంలో ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు తన వ్యక్తిగత విషయాన్ని ఒకటి పంచుకొని అందరినీ ఆశ్చర్యపరిచారు. ఈ సందర్భంగా ఇజ్రాయెల్ ప్రధాన మంత్రి నెతన్యాహు మాట్లాడుతూ.. తన భార్యతో తన మొదటి డేట్ ఒక భారతీయ రెస్టారెంట్‌లో జరిగిందని, ఆ భోజనం అద్భుతంగా ఉండటం వల్లే వారి బంధం బలపడిందని సరదాగా వ్యాఖ్యానించారు. దీనికి తాను, తన పిల్లలు కూడా భారత్‌కు రుణపడి ఉంటామని ఆయన అనగానే ప్రధాని మోడీ నవ్వు ఆపుకోలేక పోయారు. భారతదేశంలోని అపారమైన ప్రతిభను, ఇజ్రాయెల్‌లోని సాంకేతిక పరిజ్ఞానాన్ని కలపడం ద్వారా అద్భుతాలు సృష్టించవచ్చని ఇద్దరు నేతలు ఆకాంక్షించారు. ప్రధానంగా కచ్చితమైన వ్యవసాయం, సాఫ్ట్‌వేర్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రంగాల్లో కలిసి పనిచేయాలని నిర్ణయించుకున్నారు. ఆవిష్కరణలు, సాంకేతికత, అభివృద్ధికి సంబంధించి రెండు దేశాల మధ్య 16 కీలక అవగాహన ఒప్పందాలు జరిగాయి.రెండు దేశాల మధ్య స్నేహాన్ని మరింత బలోపేతం చేసేందుకు త్వరలోనే భారత్‌లో ఒక సమావేశాన్ని ఏర్పాటు చేయాలని నేతలు నిర్ణయించారు. 'మా వ్యక్తిగత స్నేహం, ప్రభుత్వాల మధ్య సహకారం, ప్రజల మధ్య అనుబంధం నానాటికీ బలపడుతోంది' అని నెతన్యాహు ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు. దీనిని కొనసాగించేందుకు సాధ్యమైనంత త్వరగా భారతదేశంలో ఒక ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ పర్యటన కేవలం దౌత్యపరమైన ఒప్పందాలకు మాత్రమే పరిమితం కాకుండా, ఇద్దరు దేశాధినేతల మధ్య ఉన్న బలమైన వ్యక్తిగత స్నేహాన్ని ప్రపంచానికి చాటిచెప్పింది.

# కుమ్మెర ఘటనపై లోతుగా దర్యాప్తు

**నాగర్ కర్నూల్:** జిల్లాలోని కుమ్మెర మల్లన్న జాతరలో జరిగిన ఘటన కలకలం రేపిన సంగతి తెలిసిందే. ఈ ఘటనపై ఇరు వర్గాల ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు పోలీసులు. ఈ క్రమంలో కుమ్మెర ఘటనపై ప్రెస్ మీట్ నిర్వహించిన జిల్లా ఎస్పీ సంగ్రామ్ సింగ్ జీ పాటిల్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ ఘటనపై ఇరు వర్గాల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. దేవాలయ పూజారి పెద్ద సాయిలు యాదవ్ సాక్ష్యం ప్రకారం... చిలకేశ్వర మౌనిక, చంద్రకళ అలియాస్ చాకలి కర్రెమ్మ, భౌరమ్మ కుమ్మెర మల్లన్న దర్శనం కోసం వచ్చిన టైంలో రద్దీ ఎక్కువగా ఉందని.. ఆ సమయంలో వారు బారికేడ్ దాటటానికి ప్రయత్నించారని.. క్యూ లైన్ లో వెళ్లమని చెప్పినందుకు తన బావ కొడుకు గణెళిశ్ కు ఫోన్ చేసి పిలిచిందని తెలిపారు. భౌరమ్మ బావ కొడుకు చాకలి గణెళిష్ కుమ్మెర గ్రామం వార్తలు అనే వాట్సప్ గ్రూప్ లో శ్రీనివాస్ రెడ్డి గురించి అశ్లీల ఆడియో పోస్ట్ చేయటంతో గణెళిశ్ ను శ్రీనివాస్ రెడ్డి ప్రశ్నించాడని తెలిపారు. ఈ క్రమంలో శ్రీనివాస్ రెడ్డి మరికొంతమంది గణెళిశ్, చంద్రకళను కొట్టారని అన్నారు. దీంతో రెండు వర్గాల మధ్య జరిగిన ఘర్షణలో శ్రీనివాస్ రెడ్డి తలకు గాయమైనట్లు తెలిపారు. ఫిబ్రవరి 18న గణెళిష్ పోలీస్ స్టేషన్ లో ఇచ్చిన ఫిర్యాదులో తన భార్య, పాపపై దాడి గురించి ప్రస్తావించలేదని.. ఇరువర్గాల వారు ఒకరిపై ఒకరు పోలీస్ స్టేషన్ లో కంప్లైంట్ ఇచ్చారని తెలిపారు పోలీసులు. ఫిబ్రవరి 20న గణెళిశ్ అతని కుటుంబసభ్యులు పోలీస్ స్టేషన్ కు వచ్చి పిటిషన్ ప్రోగ్రెస్ గురించి అడిగారని.. 21న మౌనిక తన రెండు నెలల శిశివు కదలటం లేదని నాగర్ కర్నూల్ ప్రభుత్వాసు పత్రికి వెళ్లగా... డాక్టర్లు పరీక్షించి బ్రెయిన్ డెడ్ అని అదే రోజు ఉదయం 7.55 గంటలకు ప్రకటించినట్లు తెలిపారు. హాస్పిటల్ రికార్డు ప్రకారం కుటుంబం మెడికో లీగల్ కేసు, పోస్ట్ మార్టంకు ఒప్పుకోలేదని..పాప తండ్రి గణెళిశ్ తల్లి మౌనిక రిజిస్టర్ లో సంతకాలు చేసారని తెలిపారు.పోస్ట్ మార్టం నివేదిక ప్రకారం పాపకు లోపల బయట ఎలాంటి గాయాలు లేవని నిర్ధారణ అయ్యిందని.. తెలిపారు. శ్వాసకోశ సమస్య వల్ల నిలోఫర్ లోని ఎన్.ఐ.సీ.యూలో 30 రోజుల పాటు చికిత్స అందించినట్లు తెలిపారు పోలీసులు.ఫిబ్రవరి 22న మౌనిక తాను ఎస్సి అని మరో కంప్లైట్ ఇచ్చిందని... తనను శ్రీనివాస్ రెడ్డి అనే వ్యక్తి దేవాలయ ప్రవేశం కోసం వంద రూపాయలు అడిగి కులం పేరుతో దూషించాడని తిట్టడంతోపాటు కొట్టాడని ఆరోపించింది. తనను, తన భర్తను, తన పాపపై దాడి చేసారని, మధు రెడ్డి పాపను తన్నటం వల్ల పాప రెండు మీటర్ల దూరం పడి చనిపోయిందని పిర్యాదు చేసారు. ఎస్సీ, ఎస్టీ పీఓఏ యాక్ట్ కింద కేసు నమోదు చేసి నాగర్ కర్నూల్ డీఎస్పీ విచారణ ప్రారంభించారు.ఈ కేసులో ముగ్గురు నిందితులు శ్రీనివాస్ రెడ్డి, మధు రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి లను 23న అరెస్ట్ చేసి రిమా ఒడ్ కు తరలించామని తెలిపారు. మిగత ముగ్గురు పరారీలో ఉన్నారని... ప్రత్యేక బృందాలు వారి కోసం గాలిస్తున్నాయని తెలిపారు.

# సీమ ఎత్తిపోతలపై మాటల యుద్ధం

**పరస్పర విమర్శలతో ద్దరిల్లిన మండలి**

**అమరావతి:** రాయలసీమ ఎత్తిపోతల పథకంపై ఏపీ శాసనమండలిలో అధికార తెదేపా, ప్రతిపక్ష వైకాపా సభ్యుల మధ్య మాటల యుద్ధం జరిగింది. ఆరోపణలు, ప్రత్యారోపణలతో సభ దద్దరిల్లింది. రాయలసీమ ఎత్తిపోతల పథకాన్ని ప్రభుత్వం ఆపిందని.. ఆ ప్రాంతానికి సీఎం చంద్రబాబు అన్యాయం చేశారని వైకాపా సభ్యులు విమర్శించారు. తెలంగాణ ప్రభుత్వంతో లాలూచీ పడి ప్రాజెక్టును నిలిపివేశారని ఆ పార్టీ సభ్యులు ఇషాక్ బాషా, రామసుబ్బారెడ్డి ఆరోపించారు. వైకాపా ఆరోపణలను మంత్రులు నిమ్మల రామానాయుడు , పయ్యావుల కేశవ్ తిప్పికొట్టారు. జగన్ సీఎంగా ఉండగానే ఆ ప్రాజెక్టును ఎన్జీటీ ఆపిందని.. జరిమానా కూడా విధించిందని నిమ్మల గుర్తుచేశారు. అధికారంలో ఉన్న ఐదేళ్ల పాటు ప్రాజెక్టు గురించి కనీసం పట్టించుకోలేదన్నారు. రాయలసీమ ప్రాంతానికి నిజమైన ద్రోహి జగన్ అని.. ఆయన్ను నిలదీయకుండా తప్పుడు ఆరోపణలు చేయడం దారుణమన్నారు. వైకాపా హయాంలోనే సీమలోని ప్రాజెక్టులన్నీ తీవ్ర నిర్లక్ష్యానికి గురయ్యాయని విమర్శించారు. ఆ ప్రాంతానికి నీరిచ్చేందుకు ఒక్క ప్రాజెక్టునూ జగన్ చేపట్టలేదన్నారు. రాయలసీమ ఎత్తిపోతల పథకం సాగునీటి కోసం కాదు.. తాగునీటి కోసమని వైకాపా ప్రభుత్వం 2023 ఆగస్ట్ 18న జీవో నంబర్ 364 సహా అఫిడవిట్ ఇచ్చిన విషయాన్ని నిమ్మల సభ దృష్టికి తీసుకొచ్చారు. మంత్రి సమాధానంపై మండలి ప్రతిపక్ష నేత బొత్స సహా వైకాపా సభ్యులు అసంతృప్తి వ్యక్తంచేశారు. రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్‌పై తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి చేసిన ప్రకటనపై ఎక్కడా సమాధానం ఇవ్వలేదంటూ నిరసన తెలిపారు. దీంతో సభను మండలి ఛైర్మన్ కాసేపు వాయిదా వేశారు. అనంతరం మళ్లీ సభ ప్రారంభయ్యాక గాలేరు-నగరి సుజల స్రవంతి ప్రాజెక్టుపై ప్రశ్నోత్తరాలు చేపట్టారు. అయితే రేవంత్ వ్యాఖ్యలపై మంత్రి సమాధానానికి వైకాపా సభ్యులు పట్టుబట్టారు. ఈక్రమంలో బొత్స సత్య నారాయణ, మంత్రుల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. 2020లో ఎన్జీటీకి వెళ్లి రాయలసీమ ఎత్తిపోతలను తామే ఆపామని బీఆర్ఎస్‌కు చెందిన మాజీ మంత్రి హరీశ్‌రావు తెలిపారని మంత్రి నిమ్మల అన్నారు. అప్పటి సీఎం జగన్‌తో తెలంగాణ సీఎం కేసీఆర్ మాట్లాడటంతో ప్రాజెక్టు ఆగిందని హరీశ్‌రావు స్పష్టం చేసిన విషయాన్ని తెలుసుకోవాలన్నారు. మంత్రి సమాధానంపై బొత్స అసంతృప్తి వ్యక్తంచేయగా.. మంత్రి పయ్యావుల ఘాటుగా స్పందించారు. రాయలసీమ లిఫ్ట్ విషయంలో తప్పంతా వైకాపా ప్రభుత్వానిదేనని చెప్పారు. ఆ ప్రాజెక్టును ఆపి తప్పు చేసిందెవరో ఆ పార్టీ సభ్యులు తెలుసుకోవాలని సూచించారు. రాష్ట్ర ప్రయోజనాలను వైకాపా ప్రభుత్వం తాకట్టు పెట్టిందన్నారు. సభలో గందరగోళం చెలరేగడంతో మండలి ఛైర్మన్ సభను కాసేపు వాయిదా వేశారు. ఈ క్రమంలోనే ఏపీ శాసన మండలిలో కొద్దిసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. భాజపా ఎమ్మెల్సీ సోము వీర్రాజు పైకి వైకాపా సభ్యులు ఇజ్రాయెల్, విక్రాంత్, రమేశ్ యాదవ్ దూసుకెళ్లారు. రాయలసీమ ఎత్తిపోతల పథకంపై మంత్రి నిమ్మల రామానాయుడు సమాధానం పూర్తయిన తర్వాత చర్చకు వైకాపా సభ్యులు పట్టుబట్టారు. మంత్రి సమాధానం పూర్తవడంతో తర్వాత ప్రశ్నకు మండలి ఛైర్మన్ అవకాశం కల్పించారు. దీంతో ఎమ్మెల్సీ సోము వీర్రాజు మాట్లాడేందుకు యత్నించారు. ఈ క్రమంలో ఆయన పైకి ఎమ్మెల్సీ ఇజ్రా యెల్‌తో పాటు ఆ పార్టీకి చెందిన కొందరు సభ్యులు దూసుకెళ్లారు. తాము నిరసన తెలుపుతుంటే మైక్ ఎందుకు తీసు కున్నారంటూ వీర్రాజుపై దాడికి యత్ని ంచారు. సోము వీర్రాజుకు మద్దతుగా మం త్రులు అనిత, గొట్టిపాటి రవికుమార్ వెళ్లి అడ్డుకున్నారు. ఉద్రిక్త వాతావరణం మధ్య సభను మండలి ఛైర్మన్ మోషేనురాజు కాసేపు వాయిదా వేశారు.

## సిఎం రేవంత్‌లో హిమాచల్ మంత్రి భేటీ

**హైదరాబాద్:**హిమాచల్ ప్రదేశ్ మంత్రి విక్రమాదిత్య సింగ్ హైదరాబాద్‌కు వచ్చారు. ఈ సందర్భంగా ఆయన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ని మర్యాదపూర్వకంగా కలిసారు. మంత్రిని సిఎం సాదరంగా స్వాగతించి సన్మానించారు.

## గిరిజన కళపై ఐదు రోజుల శిక్షణ

**హైదరాబాద్:** గిరిజన సంక్షేమ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ సబ్యసాచి ఘోష్ సూచనల మేరకు గిరిజన సంక్షేమ శాఖ వారి ఆధ్వర్యంలో మొట్టమొదటిసారిగా వినూత్నంగా 20 మంది క్రాఫ్ట్ టీచర్స్ మరియు 10 మంది గిరిజన ఆర్టిజన్స్ మొత్తం 30 మందికి గిరిజన సంప్రదాయక కళల పైన ఫ్యాబ్రిక్ బ్లాక్ ప్రింటింగ్ అనే అంశంపై ఐదు రోజుల రెసిడెన్షియల్ శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. హైదరాబాదులో 26 వ తేదీ నుండి 2 మార్చి వరకు నిర్వహిస్తున్నారు.శిక్షణలో పాల్గొన్న అభ్యర్థులు ఐటిడిఏ ఉట్నూర్, ఏటునాగారం, భద్రాచలం, ప్లెయిన్ ఏరియా నుండి సంబంధిత ఐటిడిఏ అధికారుల ద్వారా నామినేట్ చేయబడి రావడం జరిగింది. వీరందరికీ భోజనం, వసతి, రవాణా సౌకర్యాలు కల్పిస్తున్నారు. అదేవిధంగా పదిమంది గిరిజన ఆర్టిజన్స్ కు ప్రతిరోజు వెయ్యి రూపాయల చొప్పున ఆనరోరియం కూడా ఇవ్వడం జరుగుతుంది. ఈ కార్యక్రమంలో టిఆర్ఐ సంచాలకులు డాక్టర్ వి సముజ్వల , టి ఆర్ ఐ సంగ్రహాలయ సంరక్షకులు డాక్టర్ డి సత్యనారాయణ , శిక్షణనిస్తున్న డైరెక్టర్ డా. సునీతా ప్రసాద్ బృందం, ట్రైనింగ్ కోఆర్డినేటర్ శ్రీమతి అజ్మీరా శైలజ , టిఆర్ఐ సిబ్బంది పాల్గొన్నారు.

## సురక్షిత బాల్యంతోనే సుస్థిర భవిష్యత్తు

**అమరావతి:** సురక్షిత బాల్యంతోనే సుస్థిర భవిష్యత్తు ఉంటుందని ఆంధ్రప్రదేశ్ డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా వ్యాఖ్యానించారు. ఏపీ వ్యాప్తంగా 'ఆపరేషన్ చిన్నారి తల్లి' ప్రత్యేక డ్రైవ్ ప్రారంభించి నట్లు తెలిపారు. ఇందుకు సంబంధించిన 'ఆపరేషన్ చిన్నారి తల్లి' పోస్టర్‌ను మంగళగిరి డీజీపీ కార్యాలయం లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డీజీపీ మీడియాతో మాట్లాడారు. చిన్నారులపై లైంగిక నేరాల నివారణెలి లక్ష్యంగా చర్యలు చేపట్టామని డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా పేర్కొన్నారు. పోక్సో కేసుల్లో జీరో పెండెన్సీ - 60 రోజుల్లో ఛార్జ్‌షీట్లు, స్పీడ్ ట్రయిల్ మానిటరింగ్ ద్వారా శిక్షల శాతం పెంచుతున్నామని తెలిపారు. తరచూ లైంగిక నేరాలకు పాల్పడే వారిపై సెక్సువల్ ఆఫెండర్స్ షీట్స్ (ఇుక్షా) నమోదు చేస్తున్నామని స్పష్టం చేశారు. సున్నిత ప్రాంతాల్లో పటిష్టమైన రాత్రి గస్తీ నిర్వహిస్తున్నామని తెలిపారు. పాఠశాలలు, అంగన్వాడీలు, హాస్టళ్లలో 'గుడ్ టచ్ - బ్యాడ్ టచ్'లపై అవగాహన కార్యక్రమాలు... చిన్నారుల తల్లులను అప్రమత్తం చేస్తున్నామని వివరించారు. బాధితులకు కౌన్సిలింగ్, పునరావాస సహాయం కల్పిస్తున్నామని చెప్పుకొచ్చారు. మహిళలు, చిన్నారుల భద్రతకు పెద్దపీట వేస్తున్నామని డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా స్పష్టం చేశారు.

## కుమ్మెర ఘటనపై స్పందించిన ఎన్‌హెచ్‌ఆర్‌సి

**న్యూఢిల్లీ:** నాగర్‌కర్నూల్‌లో జరిగిన కుల వివక్ష దాడి , పోలీసుల నిర్లక్ష్యంపై జాతీయ మానవ హక్కుల కమిషన్ సీరియస్ అయ్యింది. ఘటనపై నాలుగు వారాల్లోగా నివేదిక ఇవ్వాలని జిల్లా యంత్రాంగాన్ని ఆదేశించింది. న్యాయవాది వినోద్ హిందుస్థానీ దాఖలు చేసిన ఫిర్యాదుపై స్పందిం చిన కమిషన్, నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్, ఎస్పీకి నోటీసులు జారీ చేసింది. ఈ ఘటనపై తీసుకున్న చర్యల నివేదికను నాలుగు వారాల్లోగా సమర్పించాలని ఆదేశించింది. ఈనెల 18న కుమ్మెర మల్లన్న స్వామి జాతర సందర్భంగా చిలుకేశ్వరం చంద్రకళ కుటుంబాన్ని ఆలయంలోకి ప్రవేశాన్ని నిరాకరించడంతో పాటు రెండు నెలల పసికందును ఉద్దేశపూర్వకంగా తొక్కడంతో ఆ శిశువు మరణించింది. నిందితులపై చర్యలు తీసుకోవాల్సిన చర్యలపై పోలీసులు నిర్లక్ష్యం వహించడాన్ని తప్పుపడుతూ న్యాయవాది కమిషన్‌కు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. బాధితులు నాగర్‌కర్నూల్ పోలీసు స్టేషన్‌కు వెళ్లినప్పుడు, నిందితులకు ఉన్న రాజకీయ పలుకుబడి కారణంగా ఎఫ్.ఐ.ఆర్ నమోదు చేయడానికి అధికారులు నిరాకరించారని ఆరోపించారు. పోలీసులు రాజ్యాంగ రక్షణలు, సుప్రీంకోర్టు మార్గదర్శకాలను సైతం ఉల్లంఘించారని కమిషన్ గుర్తించిందన్నారు. నిందితులను అరెస్టు చేయడం, విధి నిర్వహణలో విఫలమైన పోలీసు అధికారులపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని, బాధితులకు రక్షణతో పాటు పరిహారం అందించాలని కమిషన్ పేర్కొందని వివరించారు.. ఎస్సీ, ఎస్టీ వర్గాలకు న్యాయం జరిగే పక్రియలో రాజకీయ పలుకుబడి అడ్డంకి కాకూడదని నిర్ధారించడానికి కమిషన్ జోక్యం ఒక కీలక ముందడుగు అన్ని వినోద్ హిందుస్థానీ పేర్కొన్నారు

## విద్యుత్ సరఫరాలో ఔట్ సోర్సింగ్ సిబ్బంది

**అమరావతి:** లైన్‌మెన్‌ల నియామకంపై ఏపీ శాసనమండలిలో చర్చ జరిగింది. ఈ సందర్భంగా మండలి సభ్యులు, ఆలపాటి రాజా, కావలి గ్రీష్మ, బీటీ నాయుడు అడిగిన ప్రశ్నకు విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ సమాధానం ఇచ్చారు. నాణ్యమైన, నిరంతరాయ విద్యుత్ సరఫరా కోసం క్షేత్ర స్థాయి సిబ్బంది చాలా అవసరమని తెలిపారు. క్షేత్రస్థాయి విద్యుత్ అవసరాల కోసం కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్‌లో నియమించుకున్నామని వివరించారు. 18 వేల మంది మూడు డిస్కంల పరిధిలో వివిధ పద్ధతుల్లో నియామకమై పని చేస్తున్నారని అన్నారు. 5580 మంది ఎనర్జీ అసిస్టెంట్‌లకు ట్రైనింగ్ ఇచ్చి వారి సర్వీసులను ఉపయోగించుకుంటామని మంత్రి గొట్టిపాటి రవి కుమార్ వెల్లడించారు. ఏఈల కొరతపై సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లామని, నియామకాలను త్వరలోనే పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. క్షేత్రస్థాయిలో నాణ్యమైన విద్యుత్ సరఫరా కోసం ఆర్డీఎస్ఎస్ పనులు చేపడుతున్నామన్నారు. ఆర్డీఎస్ఎస్ ద్వారా ఫీడర్ బైఫరికేషన్ చేసి వ్యవసాయానికి నిరంతరాయ విద్యుత్ ఇస్తామని తెలిపారు. ఆర్డీఎస్ఎస్ పనుల కోసం సుమారు రూ. 8 వేల కోట్లు ఖర్చు చేస్తున్నామని చెప్పుకొచ్చారు. 70 శాతం ఆర్డీఎస్ఎస్ పనులు ఇప్పటికే పూర్తి చేశామని వివరించారు. ఏప్రిల్ నాటికి వంద శాతం ఆర్డీఎస్ఎస్ పనులు పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. విశాఖపట్నంలో తుఫానులను తట్టుకునేందుకు అండర్ గ్రౌండ్ కేబుల్ వ్యవస్థ నిర్మిస్తున్నామని వెల్లడించారు.

## జూబ్లీహిల్స్ వెంకన్నకు పుష్పయాగం

**హైదరాబాద్:** హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో పుష్పయాగ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. గురువారం జరిగిన ఈ కార్యక్రమంలో దివ్యమైన పుష్పసుగంధాలతో, భక్తి పారవశ్య వాతావరణంలో పుష్పయాగ సేవ అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ ఆలయంలో ఫిబ్రవరి 17 నుండి 25వ తేదీ వరకు జరిగిన వార్షిక బ్రహ్మోత్సవాలు విజయవంతంగా ముగిసిన సంగతి తెలిసిందే. నిత్యకైంకర్యాలు, బ్రహ్మోత్సవాల సందర్భంగా అర్చకులు, పరిచారకులు, అధికారులు, భక్తులవల్ల తెలియకుండానే ఏవైనా లోపాలు సంభవించి ఉంటే, వాటి నివృత్తి కోసం పుష్పయాగం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ క్రమంలో ఉదయం 5.00 గంటల నుండి 6.30 గంటల వరకు యాగశాలలో వేదపండితులు వైదిక కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు.

## కట్టుదిట్టంగా వాహన తనిఖీలు

**హైదరాబాద్:** సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో పోలీసులు నిఘా కట్టుదిట్టం చేశారు. శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా 'విజిబుల్ పోలీసింగ్'ను ముమ్మరం చేస్తూ.. గల్లీ గల్లీలో గస్తీ పెంచారు. ఇందులో భాగంగా బాలానగర్ ఏసిపి నరేష్ రెడ్డి పర్యవేక్షణలో బాలానగర్, అల్లాపూర్ పోలీస్ స్టేషన్ల పరిధిలో గురువారం ప్రత్యేక వాహన తనిఖీలు నిర్వహించారు. అనుమానాస్పద కదలికలపై నిశితంగా దృష్టి సారించిన పోలీసులు.. వాహనదారులకు నిబంధనలపై అవగాహన కల్పించారు. బాలానగర్ ఇన్‌స్పెక్టర్ నరసింహ రాజు ఆధ్వర్యంలో గురుమూర్తినగర్ ప్రధాన రహదారి వద్ద తనిఖీలు చేపట్టారు. ప్రయాణికుల లైసెన్సులు, వాహన పత్రాలను పరిశీలించడంతో పాటు పెండింగ్ చలానాలు ఉన్న వాహనాలను గుర్తించారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే ఎదురయ్యే పరిణామాలను వాహనదారులకు వివరించారు. అటు అల్లాపూర్ ఇన్‌స్పెక్టర్ వెంకట్ రెడ్డి నేతృత్వంలో విష్ణు విస్తారా రోడ్డులో ముమ్మరంగా తనిఖీలు జరిగాయి. అనుమానిత వ్యక్తులను విచారించడంతో పాటు వాహనాల కదలికలపై నిఘా ఉంచారు. ప్రజల భద్రత దృష్ట్యా ఈ తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని పోలీసులు స్పష్టం చేశారు.

## వ్యవసాయాధికారి సస్పెన్షన్

**పెద్దపల్లి:** పెద్దపల్లి మండల వ్యవసాయ అధికారి కే.అలివేణిని సస్పెండ్ చేస్తూ జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ఉత్తర్వులు జారీ చేశారు. ఫిబ్రవరి 24వ తేదీన ఏసీబీ అధికారులు జరిపిన ఆకస్మిక తనిఖీల నేపథ్యంలోనే ఆమెను సస్పెండ్ చేసినట్లుగా చర్చ జరుగుతోంది. కొన్నేళ్లుగా వ్యవసాయ శాఖ అధికారుల మధ్య ఆధిపత్య పోరు కారణంగా సమన్వయం లోపించింది. ఈ క్రమంలోనే వ్యవసాయ అధికారులకు సంబంధించి ఒకదాని తర్వాత మరో సంఘటనలు బయటకొస్తున్నాయని పెద్దపల్లిలో చర్చ నడుస్తోంది. గత వారం రోజులుగా అధికారుల మధ్య జరుగుతున్న వివిధ రకాల పర్యావసానాలే మండల వ్యవసాయ శాఖ కార్యాలయంపై ఏసీబీ తనిఖీలకు దారి తీసిందని.. అందులో వెలుగు చూసిన విషయాల ఆధారంగానే క్రమశిక్షణ చర్యలు కొనసాగుతున్నాయని సమాచారం. ఏసీబీ విచారణ పూర్తయ్యే వరకు ఆమె సస్పెన్షన్ అమలులో ఉంటుందని కలెక్టర్ తెలిపారు. అనుమతి లేకుండా హెడ్ క్వార్టర్స్ విడిచి వెళ్లరాదని ఆదేశించారు.

## రెండోపెళ్లి కోసం దారుణం

**నిజామాబాద్:** నిజామాబాద్ జిల్లా ఇందల్వాయి మండలం గన్నారంలో దారుణం జరిగింది. నిండు గర్భిణీని గొంతు నులిమి చంపాడు భర్త. ఈ నెల 22వ తేదీ రాత్రి నిద్రిస్తున్న భార్య సుమలతను చంపాడు భర్త నాగేష్. ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. భార్యను చంపి రెండో పెళ్లి చేసుకోవాలని నాగేష్ ఈ దారుణానికి పాల్పడ్డాడు. నిపోయాక సహజ మరణంగా చిత్రీకరించే యత్నం చేశాడు. అల్లుడు ప్రవర్తనపై అనుమానంతో పోలీసులకు ఫిర్యాదు చేసింది సుమలత తల్లి. ఈ మేరకు పోలీసులు నాగేష్?ను అదుపులోకి తీసుకుని తమదైన శైలీలో విచారించారు. పోలీసుల విచారణలో తానే చంపినట్లు ఒప్పుకున్నాడు నాగేష్. ఈ మేరకు నాగేష్?పై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## కెసిఆర్ వల్లనే తెలంగాణ అప్పులపాలు: వివేక్

**హైదరాబాద్:** కేసీఆర్ నిర్ణయాల వల్లే తెలంగాణ అప్పుల పాలైందని.. కమిషన్ల కోసమే ఆయన ప్రాజెక్టులు కట్టారని మంత్రి వివేక్ వెంకటస్వామి విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ పేరుతో బీఆర్ఎస్ లక్ష కోట్ల అవినీతికి పాల్పడిందన్నారు. రూ.లక్షా 75 వేల కోట్లు కాళేశ్వరం ప్రాజెక్ట్ కోసం ఖర్చు చేశారని.. కానీ నాలుగేండ్లకే ఆ ప్రాజెక్ట్ కుప్పకూలిందని విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ వల్ల తెలంగాణ ప్రజలపై మోయలేని భారం పడిందన్నారు. పదేండ్లలో బీఆర్ఎస్ పార్టీ ఆస్తులు, సొంత ఆస్తులు పెంచుకుందని అన్నారు. ప్రపంచంలోనే ధనిక రీజనల్ పార్టీ బీఆర్ఎస్ మాత్రమేనని చెప్పారు. కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన అవినీతిని ఎప్పటికప్పుడు ప్రజలకు వివరించామన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన అవకతవకలపై విచారణ చేసేందుకు కేసు సీబీఐకి అప్పగించామని తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ పై సీబీఐ ఎంక్వైరీ చేయాలని డిమాండ్ చేశారు. కమిషన్ల కోసమే ప్రాణహిత చేవెళ్ల డిజైన్ మార్చారని అన్నారు.

## పల్టీలు కొట్టు రిజర్వాయర్‌లోకి దూసుకెళ్లిన కారు

**జనగామ:** జనగామ జిల్లాలో ఘోర ప్రమాదం జరిగింది. స్టేషన్ ఘన్ పూర్ లో స్విఫ్ట్ కారు పల్టీలు కొట్టి రిజర్వాయర్ లోకి దూసుకెళ్లింది . గురువారం జరిగిన ఈ ఘటనకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి.. జనగామ జిల్లా చిల్పూరు మండలం దేశాయి తాండా దగ్గర ఘోర ప్రమాదం జరిగింది. స్టేషన్ ఘన్ పూర్ నుంచి దేశాయి తండాకు స్విఫ్ట్ కారు వెళ్తుండగా పల్టీలు కొట్టి రిజర్వాయర్ లోకి దూసుకెళ్లింది . ఈ ఘటనలో ఒకరికి తీవ్ర గాయాలవ్వగా.. డ్రైవర్ గల్లంతైనట్లు తెలుస్తోంది. గాయాలతో బయటపడ్డ దారావత్ చరణ్ ను ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. డ్రైవింగ్ చేస్తున్న భూక్యా పవన్ ఆచూకీ దొరకలేదని తెలిపారు పోలీసులు.

## మండలిలో మంత్రులను అడ్డుకున్న వైసిపి

**అమరావతి:** వైసీపీ నేతలపై శాసనమండలి చీఫ్ విప్ పంచుమర్తి అనురాధ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం మీడియాతో మాట్లాడుతూ.. కౌన్సిల్‌లో వైసీపీ సభ్యులు అనేక నాటకాలు ఆడుతున్నారని మండిపడ్డారు. ప్రభుత్వం సమాధానం చెబుతుంటే అడ్డుకుంటున్నారన్నారు. బడ్జెట్ సెషన్ అంతా గాలికి వదిలేసి చర్చ జరగకుండా చేశారని విమర్శించారు. ప్రశ్నోత్తరాలు కూడా జరగకుండా అడ్డుకున్నారని అనురాధ అన్నారు. ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్‌ను సమాధానం ఇవ్వనీయకుండా నియంతలా ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ వ్యవహరిస్తున్నారని విమర్శించారు.స్వల్పకాలిక చర్చను మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ప్రారంభించాల్సి ఉందని.. మంత్రి స్టేట్‌మెంట్ ఇవ్వడానికి వీలు లేదని.. ముందు తామే మాట్లాడతామని వైసీపీ నేతలు పట్టుబట్టారని తెలిపారు. ఇది ప్రజాస్వామ్యం అనుకుంటున్నారా రాజారెడ్డి రాజ్యాంగం అనుకుంటున్నారా అని ప్రశ్నించారు. వైసీపీ సభ్యుల ఆందోళనలతో మండలి ఛైర్మన్ సభను రేపటికి(శుక్రవారం) వాయిదా వేశారని తెలిపారు.

## హైదరాబాద్ షాపింగ్ మాల్‌లో అగ్నిప్రమాదం

**హైదరాబాద్:** జూబ్లీహిల్స్‌లోని మంగళగౌరి షాపింగ్ మాల్‌లో గురువారం ఉదయం భారీ అగ్నిప్రమాదం జరిగింది. సకాలంలో ఫైర్ సిబ్బంది మంటలను ఆర్పింది. ఈ విషయంపై హైదరాబాద్ డిస్ట్రిక్ట్ ఫైర్ ఆఫీసర్ రాందాస్ మాట్లాడారు. ఈ ప్రమాదం ఎలా జరిగిందనే విషయంపై ఇంకా నిర్ధారణకు రాలేదని చెప్పుకొచ్చారు. బిల్డింగ్ లోపల రెన్యువేషన్ పనులు జరుగుతున్నాయని వెల్లడించారు.

# మమతా బెనర్జీ కళ్లు తెరవాలి

బెంగాల్లో సర్ ప్రక్రియపై అభ్యంతరాలు వ్యక్తం కావడంతో అక్కడ జ్యుడిషియల్ అధికారుల అజమాయిషీలో జరగాలని ఇటీవల సుప్రీంకోర్టు ఆదేశించింది. దీంతోపాటే సర్ ప్రక్రియను అడ్డుకోరాదని మమతా బనర్జీకి సుప్రీం గట్టిగానే సూచించింది. నిజానికి సర్ ప్రక్రియ ద్వారా ఓట్లను సంస్కరించడం అవసరమే. తమిళనాట లక్షల్లో ఓట్లు తొలగించారు. గుజరాత్‌లోనూ తొలగించారు. ఇప్పుడు దక్షిణాదిలో కూడా సర్ ప్రక్రియ కొనసాగనుంది. ఈ క్రమంలో ఓట్లు తొలగింపు వల్ల ఎవరైనా తమ ఓటు నిజంగానే కోల్పోతే వారి పక్షాన ప్రభుత్వం పోరాడాలి. అంతే తప్ప అడ్డుకోవడం సరికాదు. ఇదేదో రాజ్యాంగ విఘాతం కలిగించారన్న రీతిలో ప్రచారం చేయడం విపక్షాలకు తగదు. ఎన్నికల కమిషన్ ఏం చేసినా, ఎలా చేసినా విమర్శించే విపక్ష స్థానంలో ఉన్న కాంగ్రెస్, తృణమూల్ కాంగ్రెస్, డిఎంకెపార్టీలు తీవ్రంగా అడ్డుపడు తున్నాయి. బ్యాలెట్ బాక్స్ లతో ఓటింగ్ విధానం ఎలక్ట్రానిక్ ఓటింగ్ పద్ధతికి మారాక కొన్ని ఎన్ని కల వరకూ బాగా నడిచిందని ప్రశంసలు ఇచ్చిన పార్టీలు ఇప్పుడు ఆ విధానం వల్ల తమకు నష్టం వాటిల్లుతోందని ఘోషిస్తున్నాయి. పార్టీ ఏదైనా తమకు ఓటింగ్ అనుకూలంగా రాకపోయి ఓటమిపాలైతే ఎలక్ట్రానిక్ ఓటింగ్ ప్రక్రి యలో లోటుపాట్లు ఉన్నందునే తాము ఓడిపోయామని విమర్శలు గుప్పిస్తున్నారు. విపక్ష పార్టీలు తమ స్థానాలు మారినా విమర్శలకు వెనుకాడడం లేదు. 'సర్' పేరెత్తితేనే విపక్షాల్లో అదీ అతి ముఖ్యంగా కాంగ్రెస్ పార్టీ రాజ్యాంగ అపచారం జరిగిందని అంటున్నారు. ఇలా కాకుండా ఎక్కడైనా ఓట్ల తొలగింపుతో ఎవరైనా నష్టపోతే దానిని ఆధారంగా చేసుకుని పోరాడాలి. కానీ మొత్తం ప్రక్రియనే వ్యతిరేకించడం ద్వారా రాజ్యాంగాన్ని తృణీకరిస్తున్నాయని గుర్తించాలి. సుప్రీం ఇచ్చిన ఆదేశాలు లేదా సూచనలు ఆయా రాజకీయ పార్టీలకు కనువిప్పు కావాలి. ఇంకా సర్ ప్రక్రియను అప్రతిష్టపాలు చేయాలనే ఆలోచన నుంచి రాజకీయ పార్టీలు బయటపడాలి. ఎన్నికల కమిషన్ పై సవాల్ చేసిన కాంగ్రెస్ పార్టీ ఓట్ చోరీపై తమ నిరసన ధ్వనులను పెంచుతున్నాయి. ఒకపక్క ఎన్నికల కమిషన్ త్వరలో ఎన్నికలు జరిగే పశ్చిమబెంగాల్, తమిళ నాడు, కేరళ వంటి రాష్ట్రాలలో ఓటర్ల జాబితా విస్తృత సవరణ (సర్) కార్యక్రమాన్ని చేపట్టగా కాంగ్రెస్ అధ్యక్షు డు రాహుల్గాంధీ, 'ఓట్ చోరీ' ప్రచార కార్యక్రమాన్ని బహుళ ప్రచారం చేస్తున్నారు. బీహార్ ఎన్నికల్లో చతికిలపడినా ఓటరు జాబితా విషయంలో రాజీ పడేది లేదనే ధోరణిలో ముందుకు కదులు తున్నారు. బీహార్లో 'సర్' కార్యక్రమం చేపట్టినప్పుడు ఎన్నికల కమిషన్ను కాంగ్రెస్ పార్టీ విపరీ తంగా ఆరోపణలు గుప్పించింది. ఎన్నికల కమిషన్ తన ధోరణిలో తనప్రణాళిక ప్రకారం ఓటరు జాబితా సవరణ కార్యక్రమం చేపట్టింది. ఎన్నికలు సజావుగానే నడిపించింది. బీహార్లో అప్పటికే అధికారంలో ఉన్న పార్టీకే ప్రజలు పట్టం కట్టారు. అంటే విపక్షాల అభ్యంతరాలు ఎవరినీ కదిలించలేదన్నది సుస్పష్టం. అయినా కాంగ్రెస్ తదితర పక్షాలు తాము పట్టిన కుందేటికి మూడే కాళ్లన్న ధోరణిలో తమ పిడివాదంతో విమర్శలు గుప్పిస్తున్నాయి. ఓటు దొంగల కబంధ హస్తాల నుంచి భారత ప్రజాస్వామ్యాన్ని రక్షించే నినాదంతో కాంగ్రెస్ సంతకాల సేకరణ చేస్తోంది. బీహార్ ఫలితాల తర్వాత కాంగ్రెస్ పార్టీ తన ఆలోచనలో మార్పు తెచ్చుకోగలదని అందరూ భావించారు. కానీ అలా జరుగలేదు. కనీసం ఆది నుంచీ ఒకే మాటమీద వ్యవహా రాన్ని నడిపిస్తున్నారు. బోగస్ ఓట్లను చేర్చడం, విపక్ష అనుకూల ఓటర్లను తొలగించడం, ఓటర్ల జాబితాలో అవకతవకలకు పాల్పడడం వంటివి ఎన్నికల కమిషన్ భారతీయ జనతా పార్టీలు కలిసికట్టుగా వ్యవహరిస్తున్నాయన్నది కాంగ్రెస్ ఆరోపణలు. బిజెపి ఓటర్లకు ఆయా నియోజక వర్గాల్లో నగదు పంచుతున్నా చర్యలు తీసుకోకుండా, ఇసి సహకరిస్తోందని విపక్షాలు గట్టిగా నమ్ముతు న్నాయి. తాజాగా పశ్చిమ బెంగాల్లో ఓటర్ల జాబితా సవరణ మొదలైంది. ఆ రాష్ట్ర ముఖ్య మంత్రి మమతా బెనర్జీ కూడా ఎన్నికల కమిషన్పై రుసరుసలాడుతున్నారు. దేశవ్యాప్తంగా ఓటరు జాబితా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ఒక ఉద్దేశపూర్వక కుట్రగా అభివర్ణించారు. బీహార్ లో 'సర్' అమలులో విజయవంతమైన కార్యక్రమంగా రూపొందించి దేశవ్యాప్తంగా ఇలాంటి కార్యక్రమాన్ని చేప ట్టేందుకు ఇసి నిర్ణయం తీసుకుందంటే అది ఎంతోమంచి కార్యక్రమమేననుకోవాలి. అయినా బిజెపియేతర ఇండియా కూటమిలు ప్రధానపక్షమైన కాంగ్రెస్ఎన్నికల కమిషన్ వివవరణలను ఆకళింపు చేసుకోలేకపోయింది. దానికితోడు దేశవ్యాప్త 'సర్' విచారణ కోసం నియమితులైన 16మంది బిఎల్ఎలు ఒత్తిడి వల్లనే మరణించారన్న వార్తలను ఆసరాగా చేసుకుని ఇసి ఒత్తిడిలపై కాంగ్రెస్ ధ్వజమెత్తింది. పశ్చిమ బంగలోని ధులగోరి, బిరాటి, న్యూటేన్ ఘసురి వంటి ప్రాంతాల్లో ఎక్కువగా ఉండే బంగ్లా దేశీయులు ఓటర్ల జాబితా ఏరివేతలో తగు పత్రాలు చూపలేక అక్రమంగా వలస వచ్చినట్లు తేలినవారంతా ఇప్పుడు బంగ్లాదేశ్ దారిపట్టారు. ఇప్పుడీ కార్యక్రమం వలన పశ్చిమ బెంగాల్లో సంక్లిష్ట పరిస్థితులేర్పడ్డా యి. బంగ్లాదేశ్ నుంచి వచ్చి బెంగాల్లో ఉండేవారి పత్రా లను చూసే పనిని బిఎస్ఎఫ్ జవాన్లకు అప్పగించారు. వెనక్కివెళ్లే సమయంలోనూ వీరే వారిపత్రాలను పరిశీ లించి పోలీసులకు పంపాల్సి ఉంటుంది. ఈ పక్రియ ఎంతో కష్టమైనది. సుదీర్ఘమైనది. బంగ్లాదేశీయుల రివర్స్ మైగ్రే షన్తో బెంగాల్ పోలీసులు సతమత మవుతున్నారు. సరైన పత్రాలు లేనివారిని నిర్బంధించి జైల్లోపెట్టే పరిస్థితి ఉంది. నిజానికి బంగ్లాదేశీయులు పశ్చిమ బెంగాల్లో ప్రవేశించిన ప్పుడు దళారీల ద్వారా ఆధార్ కార్డులు రేషన్ కార్డులు, ఓటరు ఐడీలతో ప్రవేశించారు. ఇప్పుడు అలాంటి ఎన్నీ బయటపడి పత్రాలన్నీ నకిలీవని తేలుతున్నందున మమతా

# పవిత్ర రోజాలో ఆరోగ్య రహస్యం

**గుంటూరు:** రంజాన్ మాసంలో ఉపవాసదీక్ష ప్రత్యేకతే వేరు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఉపావాస దీక్ష చేయడం ఆరోగ్య రక్షణ రహస్యం దాగివుంది. పవిత్ర గ్రంథమైన ఖురాన్ ప్రకారం ఉపవాస దీక్షలు పాటించడం ఆరోగ్యానికి మంచిదేనని గ్రంథాలు తెలుపుతున్నాయి. రంజాన్ మాసంలో ముస్లింలు ఉపవాసదీక్షలు చేపట్టడడంవల్ల ఎంతో పుణ్యం, మంచి ఆరోగ్యంగా ఉంటామని ఇస్లామిక్ గ్రంథాలు పేర్కొంటున్నాయి. సూర్యోదయానికి ముందు సూర్యాస్తమయం తర్వాత ఆహారం తీసుకోవడం ద్వారా జీర్ణకోశ సంబంధ వ్యాధులు దూరమవుతాయని ప్రకృతి వైద్యులు స్పష్టం చేస్తున్నారు.రోజావల్ల జీర్ణకోశ వ్యాధులు దూరం సహర్, ఇఫ్తార్ వేళలో ఆహారాన్ని తీసుకోవడంలో ఎన్నో శాస్త్రీయ కారణాలు కనిపిస్తున్నాయి. రుషులు, సూర్యోదయానికి ముందు సూర్యాస్తమయం తర్వాత ఆహారాన్ని తీసుకునేవారని, ఉద యం, సాయంత్రం వేళల్లో ఆహారాన్ని స్వీకరించడం ద్వారా ఎన్నో లాభాలున్నాయి. తీసుకున్న ఆహారం సంపూర్ణంగా జీర్ణమవుతుందని, జీర్ణశక్తి పెరుగుతుందని, దీంతో రోగనిరోధక శక్తి కూడా పెరుగుతుంది. రోజా సమయంలో ఎక్కువగా పండ్లు ఫలాలు తీసుకుంటారని వీటిలో ఫోరిక్ యాసిడ్, కాల్షియం ఉంటాయి. ఇవి ఎనిమియాను దూరం చేస్తాయి.సంవత్సరంలోని 12 నెలల్లో పవిత్రమైన రంజాన్ మాసానికి విశేష ప్రాముఖ్యత ఉంది. సూర్యోదయానికి ముందు ఆహారం తీసుకోవడంలోనే ఆరోగ్యం దాగి వుందని ఇస్లాం బోధిస్తుంది. మహ్మద్ ప్రవక్త కూడా ప్రాతఃకాలానికి ముందే ఆహారాన్ని స్వీకరించేవారని ఆయన అనుచరులు ఎన్నో హదీసులలో వివరించారు. ఉపవాస వ్రతం రోజా ఈ మాసంలోనే విధిగా నిర్ణయించబంది. వేయి మాసాలకన్నా అత్యంత విలువైన రాత్రి లైలతుల్ ఖద్ర్ మానవాళి మార్గదర్శనం కోసం దైవం పంపిన పవిత్ర గ్రంథం ఖురాన్ కూడా ఈ మాసంలోనే అవతరించింది. ఇన్ని ప్రత్యేకతలు ఉన్న రంజాన్ మాసం రోజాలు ఉండేవారికి అంత పుణ్యం ఉంటుందని ఇస్లామిక్ గ్రంథాలు తెలుపుతున్నాయి. రోజా వల్ల మానవులను మంచివారుగా సౌశీల్యవంతులుగా, దైవభీతి గలవారుగా తీర్చిదిద్ద డం, దీనివల్ల భక్తిని పెంచే అవకాశం ఉంది. స్త్రీ పురుషులందరూ రోజా వ్రతాన్ని తప్పనిసరిగా పాటించాలని దేవుడు ఆదేశించాడు. ఎవరైనా దీన్ని తిరస్కరిస్తే మతభ్రష్టులు, మార్గభ్రష్టులు అయ్యే అవకాశముంది. మానవుల బలహీనతలను, వారి కష్టసుఖాలను బాగా తెలిసిన దేవుడు ఉపవాసాలను విధిగా చేసినప్పటికీ కొందరికి కొన్ని మినహాయింపులు కూడా ప్రసాదించారు. చిన్నపిల్లలు, బాటసారులు, వ్యాధిగ్రస్తులు, వృద్ధులు, గర్భవతులు, బాలింతలు, మతిస్థిమితంలేని వారు అపరిశుద్ధావస్తలో ఉన్న స్త్రీలు ఉపవాసవ్రతం నుంచి మినహాయింపు ఉంది.ఉపవాసాలు ఉండటంవల్ల మనుషులు ఆరోగ్య వంతులుగా ఉంటారని బ్లడ్ ప్రెషర్, షుగర్ సాధారణ స్థితికి వస్తుందని వైద్యులు సూచిస్తున్నారు.

## విహాహ బంధంతో ఒక్కటైన విరోష్

**హైదరాబాద్:** నటులు విజయ్ దేవరకొండ, రష్మిక వివాహబంధంతో ఒక్కటైనట్లు తెలుస్తోంది. గురువారం ఉదయం 10.10కి రష్మిక మెడలో విజయ్ మూడుముళ్లు వేసినట్లు సమాచారం . దీంతో ఈ జంటకు అభిమానులు శుభాకాంక్షలు తెలుపుతూ పోస్టులు పెడుతున్నారు. ఈ పెళ్లి వేడుక రెండు సంస్కృతులు, సంప్రదాయాల కల యికగా జరుగుతోంది. ఉదయం విజయ్ వైపు నుంచి హిందూ సంప్రదాయ పద్ధతిలో వివాహం జరిగింది. రాజస్థాన్‌లోని ఉదయ్‌పూర్ వేదికగా జరుగుతోన్న ఈ వివాహానికి ఇండస్ట్రీ ప్రముఖులు హాజరయ్యారు. ఈ వివాహ సంబరాల్లో భాగంగా విజయ్ – రష్మిక 'విరోష్ ప్రీమియర్ లీగ్' పేరుతో సరదాగా ఓ చిన్న క్రికెట్ మ్యాచ్‌ను నిర్వహించినట్లు ఇన్‌స్టా వేదికగా పంచుకున్నారు. అలాగే బుధవారం హల్దీ వేడుకను నిర్వహించినట్లు విరోష్

## ప్రధాని నరేంద్రమోడీ అరుదైన రికార్డు

**న్యూఢిల్లీ:** భారత ప్రధాని నరేంద్ర మోదీ మరో అరుదైన గుర్తింపును సొంతం చేసుకున్నారు. ప్రపంచంలో 100 మిలియన్ ఇన్‌స్టా ఫాలోవర్లు కలిగిన తొలి రాజకీయ నేతగా సరికొత్త రికార్డును నెలకొల్పారు. 2014లో ప్రధాని మోదీ తొలిసారిగా ఇన్‌స్టాగ్రామ్‌లో చేరారు. యువతరానికి కనెక్ట్ కావడంతో ఆయన ఫాలోవర్ల సంఖ్య నాటి నుంచీ పెరుగుతూనే ఉంది. ఫాలోవర్ల సంఖ్యాపరంగా ప్రధాని మోదీ తరువాతి స్థానంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నిలిచారు. ఆయనను ఇన్‌స్టాలో ఫాలో అయ్యే వారి సంఖ్య 43.2 మిలియన్‌లు. ఆ తరువాతి స్థానాల్లో ఇండోనేషియా అధ్యక్షుడు ప్రబొవో సుబియాంతో (15 మిలియన్ ఫాలోవర్లు), బ్రెజిల్ అధ్యక్షుడు లూలా డి సిల్వా (14.4 మిలియన్ ఫాలోవర్లు), తుర్కియే అధ్యక్షుడు ఎర్డొగాన్ (11.6 మిలియన్ ఫాలోవర్లు), ప్రెసిడెంట్ జేవియర్ (6.4 మిలియన్ ఫాలోవర్లు) ఉన్నారు. ట్రంప్‌తో పాటు ఆ తరువాత నాలుగు స్థానాల్లో ఉన్న నేతల ఫాలోవర్ల సంఖ్యను కూలిపి చూసినా ప్రధాని మోదీ కంటే తక్కువగానే ఉండటం గమనార్హం. ఇక భారతీయ నేతల్లో కూడా ఫాలోవర్ల సంఖ్యాపరంగా ప్రధాని నెం.1గానే ఉన్నారు. ప్రధాని తరువాతి స్థానంలో ఉన్న యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్‌కు 16.1 మిలియన్ ఇన్‌స్టా ఫాలోవర్లు ఉండగా ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీకి ఉన్న ఫాలోవర్ల సంఖ్య 12.6 మిలియన్లు.

## ప్రైవేట్ విద్యుత్ బస్సులకు ఆర్టీసీ డిపోలు

**అమరావతి:** ప్రయివేటు విద్యుత్ బస్సులకు ఆర్‌టిసి డిపోలను అప్పగించడాన్ని ఆపాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు కోరారు. ఈ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు లేఖ రాశారు. పిఎంఇ పేరుతో ప్రయివేటు విద్యుత్ బస్సులను పూణెళికు చెందిన పినాకల్ కంపెనీ నిర్వహిస్తున్నట్లు, దానికోసం 11 డిపోలకు చెందిన 12 స్థలాలను వారికి అప్పగించాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు పత్రికల్లో వార్తలు రావడం ఆందోళనకరమని తెలిపారు. పిఎం ఇ-బస్సు సేవ పథకంలో గ్రాస్ కాస్ట్ కాంట్రాక్టు పద్ధతిలో ప్రయివేటు సంస్థల ద్వారా బస్సులు నిర్వహించే పద్ధతి అటు ఆర్‌టిసికి,

# తిరుమల ప్రతిష్ట పెంచింది వైఎస్‌ఆర్, జగన్‌లే

### హిందూమత సంరక్షణకు అనేక చర్యలు

### కూటమి నేతలు హిందూమతాన్ని కించపర్చారు.

### టిడిపి అంటేనే టెంపుల్ డిమాలిషన్ పార్టీ

### వైకాపా ఎమ్మెల్సీ వరుదు కళ్యాణి

**అమరావతి:** తిరుమల ప్రతిష్టను పెంచింది వైఎస్సార్, వైఎస్ జగన్‌లేనని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ వరుదు కళ్యాణి అన్నారు. ఆమె గురువారం అసెంబ్లీ మీడియా పాయింట్‌లో మాట్లాడుతూ.. ఇంటి దైవం అంటూనే చంద్రబాబు శ్రీవారి ప్రసాదంపై నింద మోపాడంటూ.. ఆధారాలతో కూటమికి వరుదు కళ్యాణి కౌంటర్ ఇచ్చారు. హిందూ మతాన్ని పరిరక్షిస్తామంటూనే తమ చర్యలతో కూటమి నాయకులు అడుగడుగునా హిందూ సాంప్రదాయాలను కించపరిచేలా వ్యవహరిస్తున్నారు. మాజీ సీఎం వైఎస్ జగన్ కడపలోని వేంపల్లెలో నందీశ్వర ఆలయాన్ని ప్రారంభిస్తే దానిపైనే ఫేక్ వీడియాలతో తెలుగుదేశం సోషల్ మీడియా విషం కక్కింది. టీడీపీ అంటేనే టెంపుల్ డిమాలిషన్ పార్టీ అని అర్థం. గతంలో టీడీపీ అధికారంలో ఉండగా విజయవాడలో పుష్కరాల పేరుతో 40కి పైగా ఆలయాలను కూల్చేస్తే, వైఎస్ జగన్ ముఖ్యమంత్రి అయ్యాక వాటిని నిర్మించారు. చంద్రబాబు సీఎంగా ఉన్నప్పుడే తిరుమలో వెయ్యి కాళ్ల మండపాన్ని కూల్చివేశారు. ముఖ్యమంత్రులుగా ఉండి తిరుమల ప్రతిష్టను, స్వామి వారి వైభవాన్ని పెంచిన ఘనత తండ్రీకొడుకులు వైఎస్సార్, వైఎస్ జగన్‌లకే దక్కుతుంది. వైఎస్ జగన్ ముఖ్యమంత్రి అయ్యాక శ్రీవాణి ట్రస్టు ఏర్పాటు చేసి తెలుగు రాష్ట్రాల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ కాలనీల్లో 4,111 కొత్త ఆలయాల నిర్మాణాలు మొదలు పెట్టి ఒక్కదానికి రూ.10 లక్షలు కేటాయించడం జరిగింది.అందులో 80 శాతం పనులు రామాలయాలే. రూ. 411 కోట్లతో 801 పురాతన ఆలయాల ఆధునికీకరణ పనులు చేయడం జరిగింది. దుర్గ గుడి అభివృద్ధి కోసం రాష్ట్ర చరిత్రలో ఎప్పుడూ లేనివిధంగా ప్రభుత్వ నిధులు రూ.70 కేటాయించిన ఘనత వైఎస్ జగన్‌కే దక్కుతుంది. రాష్ట్ర ప్రజల సంక్షేమం కోసం వైఎస్ జగన్ ముఖ్యమంత్రిగా దుర్గమ్మ ఆలయంలో రాజశ్యామల యాగాన్ని నిర్వహించారు.తూర్పు గోదావరి జిల్లా అంతర్వేదిలో లక్ష్మీ నారాయణ స్వామి రథానికి దుండగులు నిప్పంటిస్తే కళ్యాణోత్సవం సమయానికి కొత్త రథం తయారు చేయించి ఇస్తానని ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటూ అత్యాధునిక టెక్నాలజీతో కూడిన రథాన్ని అందజేశారు. తిరుమల శ్రీవారికి అత్యంత ప్రీతిపాత్రమైన నవనీత సేవ కోసం స్వచ్ఛమైన వెన్నను సమకూర్చడం కోసం తిరుమలలోని గోశాలను విస్తరించడం వైయస్ జగన్ సీఎంగా ఉండగానే జరిగింది. చిన్నారుల్లో భక్తిభావం పెంపొందించడం కోసం గోవింద కోటి, రామ కోటి రాసే వారికి ఉచితంగా పుస్తకాలను పంపిణీ చేయడమే కాకుండా వారికి శ్రీవేంకటేశ్వరస్వామి వారి దర్శన భాగ్యం కల్పించడం జరిగింది.టీటీడీ ఉద్యోగులకు ఇళ్ల పట్టాలతోపాటు వేతనాలు పెంచడమే కాకుండా కారుణ్య నియామకాలు చేపట్టారు. వంశ పారంపర్య అర్చకులకు రిటైర్మంట్ లేకుండా ఓపిక ఉన్నంత వరకు స్వామి వారికి సేవ చేసుకునే భాగ్యం కల్పించారు. తిరుమలలోని స్వామి వారి గర్భగుడిని సన్నిధి గొళ్లలు తెరిచే సాంప్రదాయాన్ని పునరుద్ధరించారు. అమరావతి, చెన్నై, భువనేశ్వర్, జమ్ముకశ్మీర్, విశాఖపట్నంతోపాటు అమెరికాలో శ్రీవారి ఆలయాలను నిర్మించి స్వామి వారి ప్రతిష్టను ప్రపంచవ్యాప్తం చేశారు. గతంలో దివంగత వైఎస్సార్ తరహాలోనే వైఎస్ జగన్ కూడా ముఖ్యమంత్రిగా ఉండగా వేద విద్యకు అధిక ప్రాధాన్యత ఇచ్చారు. బ్రహ్మోత్సవాల్లో అతి ముఖ్యమైన గరుడ సేవలో భక్తులందరూ దర్శించు కునేలా ప్రతి పౌర్ణమికి పున్నమి గరుడ సేవ నిర్వహించేలా నిర్ణయం తీసుకోవడం జరిగింది. మఠాధిపతులు, ఆగమ పండితులతో ఆగస్టు 2022లో రెండో విడత ధార్మిక పరిషత్తును నియమించి నిర్ణయాధికారాలను కల్పించిన ఘనత కూడా వైఎస్ జగన్‌కే దక్కుతుంది. అంతేకాకుండా దేవాదాయ శాఖ భూములు ఆక్రమణలకు గురికాకుండా వివాదాలతో కోర్టు కేసుల కారణంగా కాలయాపన జరగకుండా ప్రత్యేక ఆర్డినెన్స్ తీసుకొచ్చి నోటీస్ ఇచ్చిన వారం రోజుల్లో దేవాలయ భూములు స్వాధీనం చేసుకునే అధికారం ప్రభుత్వానికి కల్పించి స్వామి వారి ఆస్తులను కాపాడారు. రూ.5 లక్షల లోపు ఆదాయం ఉండే ఆలయాలకు వంశపారంపర్య హక్కులను స్థానిక భక్తుల కమిటీలకు కల్పిస్తూ జీవో ఇచ్చారు. జీవో నెంబర్ 52 ద్వారా గతంలో రూ.5 వేలు వేతనాలు పొందేవారికి రూ.10 వేలు, రూ. 10 వేలు పొందేవారికి రూ.15625 ల చొప్పున వేతనాలు పెంచుతూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఆనాడు నిర్ణయం తీసుకుంది. అర్చక సంక్షేమ ట్రస్టు ద్వారా బ్రాహ్మణులకు రూ.48 కోట్ల మేర లబ్ది చేకూర్చారు. బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్లుగా అరర్చ సమాఖ్య నాయకులకు అవకాశం కల్పించారు. 16 ఆగమ వేద పాఠశాలల ద్వారా 400 మంది విద్యార్థులకు శిక్షణ కార్యక్రమాలతోపాటు వారికి స్టై ఫండ్ కింద రూ. 3 కోట్లు చెల్లించారు. ధూమదీప నైవేద్యాల పథకం గతంలో చంద్రబాబు హయాంలో కేవలం 1100 ఆలయాలకు మాత్రమే ఉండగా వైఎస్సార్‌సీపీ హయాంలో ఆ సంఖ్యను 5338 ఆలయాల్లో అమలు చేసింది.ఆలయాల్లో రాజకీయ నేతల జోక్యానికి తావులేకుండా దేవాదాయ శాఖలో కీలకనిర్ణయాలు తీసుకునేలా 21 మందితో ధార్మిక పరిషత్‌ను ఏర్పాటు చేస్తూ 2007లో వైయస్ రాజశేఖర్ రెడ్డి గారు చట్ట సవరణ చేశారు. శ్రీవారి ఆలయంలో పిల్లలకు, క్యూలైన్లలో ఉండేవారికి ఉచితంగా పాలు, అన్నప్రసాద పంపిణీ కార్యక్రమానికి కూడా వైయస్సార్ గారే శ్రీకారం చుట్టారు. వేద విద్య, విజాజనం, పరిశోధనలు ప్రోత్సహించే ఉద్దేశంతో 2006లో వైయస్సార్ గారు వేద విద్యాలయాన్ని ప్రారంభించారు. ఏడు కొండల వైభవాన్ని చాటేలా వేంకటేశ్వర భక్తి ఛానెల్‌ను ప్రారంభించారు. తిరుపతి దర్శనం కోసం వచ్చే భక్తులకు ఉచిత లడ్డూ ప్రసాదం అందజేయడంతోపాటు అలిపిరి వద్ద నిత్య హోమం జరిపేలా కూడా వైయస్సార్ గారు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడే ప్రారంభించారు. 2006లో కళ్యాణమస్తు పథకానికి రూపకల్పన చేసి మధ్యతరగతి కుటుంబాలలో వివాహం చేసుకునే ప్రతి జంటకు బంగారు మంగళ సూత్రం, వెండి మె÷-టటెలు, నూతన వస్త్రాలు, తలంబ్రాలు, పెళ్లి సామాగ్రి, ధార్మిక స్తోత్ర పుస్తకం, పురోహితుడు, పెళ్లి భోజనం ఉచితంగా ఇచ్చే ఏర్పాటు చేయడం జరిగింది. బంగారు మంగళసూత్రం, వెండి మె÷-టటెలు, శ్రీవారి పాదాల చెంత ఉంచి పూజలు నిర్వహించి 36 వేల నూతన జంటలకు పంపిణీ చేసే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. దళిత గిరిజన గోవిందం పేరుతో విప్లవాత్మకమైన కార్యక్రమానికి శ్రీకారం చుట్టి శ్రీవారిని దళిత గిరిజన వాడలకు తీసుకెళ్లి దర్శన భాగ్యం కల్పించే బృహత్తర కార్యక్రమం కూడా దివంగత వైయస్ రాజశేఖర్ రెడ్డి ప్రారంభించారు. మత్స్యకారులకు వైదిక కర్మల్లో శిక్షణ ఇచ్చే సమానత్వాన్ని కూడా ఆయనే ప్రారంభించారు. హిందూ ధర్మ పరిరక్షణ, స్వామి వారి ప్రతిష్టను ఇనుమడింపజేయడం కోసం వైయస్సార్ ఎంతో శ్రమించారు. కానీ చంద్రబాబు మాత్రం మా ఇంటి దైవం అంటూనే తన తప్పుడు ప్రకటనలతో ఆలయ ప్రతిష్టను మంటగలిపేశారని కళ్యాణి అన్నారు.

# 'విష్ణు విన్యాసం'.. అతి తక్కువ రన్‌టైమ్..



శ్రీవిష్ణు హీరోగా యదునాథ్ మారుతీరావు దర్శకత్వంలో రానున్న చిత్రం 'విష్ణు విన్యాసం'. ఫిబ్రవరి 27న ప్రేక్షకుల ముందుకురానుంది. తాజాగా ఈ సినిమా రన్‌టైమ్‌ను చిత్రబృందం వెల్లడించింది. అతి తక్కువ రన్‌టైమ్‌లో ఇది రానున్నట్లు ప్రకటించింది. కేవలం 1.59 గంటల నిడివితో ఇది రానుంది. 'తక్కువ రన్‌టైమ్.. ఎక్కువ నవ్వులు.. మరింత వినోదం' అని పోస్టర్ షేర్ చేసింది. దీనికి సెన్సార్ యూ/ఏ సర్టిఫికెట్ జారీ చేసిన విషయం తెలిసిందే. ఈ కామెడీ డ్రామాలో నయన్ సారిక నటించారు.

విడుదల నేపథ్యంలో తాజాగా జరిగిన విలేకర్ల సమావేశంలో శ్రీవిష్ణు మాట్లాడుతూ.. ఈ చిత్రం కచ్చితంగా హిట్ అవుతుందని ధీమా వ్యక్తంచేశారు. "చాలా రోజులు గుర్తుండిపోయే చిత్రమిది. ప్రథమార్థం యువతకు బాగా కనెక్ట్ అవుతుంది. ద్వితీయార్థం మంచి ఫ్యామిలీ డ్రామాగా మారుతుంది. సినిమా పూర్తయ్యేసరికి ఓ మంచి చిత్రం చూసిన అనుభూతి కలుగుతుంది. ఇది కచ్చితంగా సూపర్ హిట్ సినిమా" అన్నారు.

# వృషకర్మ ప్రపంచంలోకి ఆ రోజే

'తండేల్' విజయం తర్వాత కథానాయకుడు నాగచైతన్య నుంచి రానున్న సినిమా 'వృషకర్మ'. 'విరూపాక్ష' ఫేమ్ కార్తీక్ దండు తెరకెక్కిస్తున్న ఈ పాన్ ఇండియా చిత్రాన్ని సుకుమార్ రైటింగ్స్, శ్రీ వెంకటేశ్వర సినీ చిత్ర సంస్థలు నిర్మిస్తున్నాయి. మీనాక్షి చౌదరి కథానాయిక. ముగింపు దశలో ఉన్న ఈ సినిమా త్వరలో ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలోనే ఈ చిత్ర గ్లింప్స్‌ను మార్చి 5న విడుదల చేయనున్నట్లు బుధవారం ప్రకటించారు. ఈ మేరకు ఓ కొత్త పోస్టర్‌ను నెట్టింట పంచుకున్నారు. ఈ గ్లింప్స్‌తో ఈ చిత్ర ప్రపంచాన్ని.. దీని కథను ప్రేక్షకులకు పరిచయం చేయనుంది చిత్రబృందం. చైతూ ఈ యాక్షన్ అడ్వెంచర్ థ్రిల్లర్‌లో అర్జున్ అనే నిధి అన్వేషకుడిగా అలరించనున్నారు. ఈ చిత్రానికి అజనీష్ లోక్‌నాథ్ సంగీత దర్శకుడిగా వ్యవహరిస్తున్నారు.





# గోల్‌మాల్ 5 లో ప్రియమణి!

ప్రయోగాత్మక పాత్రలతో ఇటు దక్షిణాదితోపాటు అటు ఉత్తరాదిలోనూ అగ్రహీరోల సినిమాల్లో అవకాశాలను అందిపుచ్చుకుంటోంది నటి ప్రియమణి. ఇటీవల ఓ ఇండో– హాలీవుడ్ చిత్రంలోనూ భాగమైనట్లు ప్రకటించిన సంగతి తెలిసిందే. తాజాగా ఆమె ఖాతాలో బాలీవుడ్ కథానాయకుడు అజయ్ దేవగణ్ ప్రధానపాత్రలో తెరకెక్కుతున్న 'గోల్‌మాల్ 5' చిత్రం చేరినట్లు తెలుస్తోంది. కామెడీ ఫ్రాంచైజీగా రూపొంది సినీప్రియులను విశేషంగా ఆకట్టుకున్న ఈ గోల్‌మాల్ ఫ్రాంచైజీకి రోహిత్ శెట్టి దర్శకుడు. ప్రస్తుతం ఆయన ఈ సీక్వెల్ చిత్రాన్ని పట్టాలెక్కించేందుకు రంగంలోకి దిగినట్లు సమాచారం. "ముంబయిలో 'గోల్‌మాల్ 5' చిత్రీకరణ ప్రారంభమైంది. అజయ్ దేవగణ్ కూడా సెట్స్‌లో చేరనున్నారు. ఈ సినిమాలో ప్రియమణి నటిస్తుంది. ప్రస్తుతం చిత్రబృందం ఆమె పాత్ర గురించి గోప్యంగా ఉంచినప్పటికీ.. ప్రియమణి ఇప్పటికే కీలకమైన సన్నివేశాల చిత్రీకరణను ప్రారంభించిందని బాలీవుడ్ వర్గాలు చెప్పినట్టు సమాచారం.

# ఆలోటు తీరింది: రాజమౌళి

"బాహుబలి', 'ఈగ' లాంటి సినిమాలు చేస్తున్నప్పుడు మన దగ్గర మోషన్ క్యాప్చర్ సాంకేతికత అందుబాటులో ఉంటే బాగుండేదని అనుకునేవాణ్ని" అని దర్శకుడు ఎస్ఎస్ రాజమౌళి అన్నారు. ఇప్పుడా సాంకేతికత అన్నపూర్ణ స్టూడియోలో అందుబాటులోకి వచ్చిందని తెలిపారు. ఇప్పటికే 'వారణాసి' సినిమా కోసం అన్నపూర్ణలోని ఈ మోషన్ క్యాప్చర్ టెక్నాలజీని వాడి కీలక సన్నివేశాలు తీశామని.. అవి అద్భుతంగా వచ్చాయని తెలియజేశారు. ఆయన ఇటీవల హైదరాబాద్‌లోని అన్నపూర్ణ స్టూడియోలో ఏ అండ్ ఎం మోషన్ క్యాప్చర్ ల్యాబ్‌ను ఆవిష్కరించారు. ఈ సాంకేతికతను అన్నపూర్ణ సంస్థ, శోభు యార్లగడ్డ మిహిరా విజువల్ ల్యాబ్స్, హాలీవుడ్ కంపెనీ యానిమాట్రిక్ ఫిల్మ్ డిజైన్ సంయుక్తంగా అందుబాటులోకి తెచ్చాయి. ఈ సందర్భంగా దర్శకుడు రాజమౌళి మాట్లాడుతూ.. "భారతదేశంలో ప్రపంచ స్థాయి సాంకేతిక నిపుణులు ఉన్నారు. కానీ, ఆ అధునాతన సౌకర్యాలు ఇక్కడ లేవు. కానీ, ఇప్పుడా లోటు ఏ అండ్ ఎంతో తీరిపోయింది. దీని ద్వారా ఇండియన్ ఫిల్మ్ మేకర్స్ ఆలోచనాధోరణిని అత్యుత్తమ స్థాయికి తీసుకెళ్లొచ్చు. నేను ప్రపంచ వ్యాప్తంగా చూసిన మోషన్ క్యాప్ ల్యాబ్‌లలో ఏ అండ్ ఎం అత్యంత కచ్చితమైనది. పని తీరు చాలా గొప్పది. 'వారణాసి'లోని కీలక సీన్స్ ఇక్కడే షూట్ చేశాం. ఫలితాలు అద్భుతంగా వచ్చాయి" అన్నారు.

"ఇప్పుడు భారత సినిమా ప్రపంచవ్యాప్తంగా విస్తరిస్తోంది. ఇదింకా ఎత్తుకు చేరాలి" అన్నారు అన్నపూర్ణ స్టూడియోస్ అధినేత, హీరో నాగార్జున. ఈ కార్యక్రమంలో శోభు యార్లగడ్డ, బ్రెట్ ఇనెసన్ తదితరులు పాల్గొన్నారు.






# భయం పోతే.. ఆట ముగిసినట్లే

'నేనొక సైనికుణ్ని.. నా ఛాతీపై బుల్లెట్‌ను భరించగలను కానీ, అగౌరవాన్ని కాదు!' అంటూ ఇసుక మాఫియా గ్యాంగ్‌స్టర్‌లను సైతం పరుగులు పెట్టిస్తున్నాడు బాలీవుడ్ నటుడు అనిల్‌కపూర్. ఆయన ప్రధాన పాత్రలో రూపొందిన యాక్షన్ చిత్రం 'సుబేదార్'. సురేశ్ త్రివేణి దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమా మార్చి 5 నుంచి అమెజాన్ ప్రైమ్ వీడియో వేదికగా వీక్షకులకు అందుబాటులోకి రానుంది. ఈ సందర్భంగా ఇటీవల ట్రైలర్‌ను విడుదల చేశారు. 'నాన్న నాకు ఒకే ఒక్క విషయం నేర్పించారు.. భయం పోయిన తర్వాత ఆట ముగిసినట్లే' లాంటి ఆకట్టుకునే సంభాషణలు అనిల్ యాక్షన్ సన్నివేశాలతో ఆద్యంతం ఆసక్తిని రేకెత్తించేలా ఉందీ ట్రైలర్. ఈ సినిమాలో రాధికా మదన్, సౌరభ్ శుక్లా, మోనా సింగ్ తదితరులు నటిస్తున్నారు. ఈ చిత్రంలో సుబేదార్ అర్జున్ మౌర్య అనే రిటైర్డ్ ఆర్మీ ఆఫీసర్ పాత్రలో కనిపించనున్నారు అనిల్. ఇసుక మాఫియా దందాపై ఓ మాజీ సైనికుడు చేసిన పోరాటం, వారి నుంచి తన కుటుంబాన్ని కాపాడుకునే పరిస్థితులలో ఎదురైన సవాళ్ల నేపథ్యంలో రూపొందిందీ చిత్రం.

PUBLISHED BY **G.KALPANA** AND **PRINTED AT YAGNA PRINTERS AND PUBLICATIONS**, H.NO 18-105/4, OPP HANUMANPET, MALKAJGIRI(M)MEDCHAL- 500047, MEDCHAL MALKAJGIRI DISTRICT,TELANGANA PUBLISHED FROM H.NO02-66/254, MALLAREDDY NAGAR PHASE 1, GAJULARAMARAM, QUTHBULLAPUR, MEDCHAL-500055, DISTRICT MALKAJGIRI, TELANGANA, EDITOR : **G.DAYAKAR REDDY**, **RNI :TELTEL/2022/83927,** PHONE NUMBER 9908293393,040- 45046154